

# మిసిమి

మాస పత్రిక

అక్టోబర్-2004




రూ. 8/-




చిత్రం : **'కోకోడైలిక్' (కొల్లేజి)**

చిత్రకారుడు : **పికాబియా**

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**


సంపుటి 15 అక్టోబర్ 2004 సంచిక 10

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


హొాజె డి ఎకెగరె ఐజాగురి — మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్ / అనువాదం: బి.వి. రామిరెడ్డి

క్లోనింగ్ — కొసరాజు వెంకటేశ్వర రావు

రాధాకృష్ణన్ విద్యాతత్వం — డా॥ బి.వి.ఎస్. భానుశ్రీ

ఆధునికత నుంచి అదృశ్యంలోకి — బి. చంద్రశేఖర్

హాలాహలమే అయినా తాను కరిగిపోతూ
అమృత బిందువులను మిగిల్చిన 'డాడాయిజం' — కాంద్రేగుల నాగేశ్వరరావు

''జ్వాలగా జీవించాలని'' — డా॥ యు.ఏ. నరసింహమూర్తి

'మహామహోపాధ్యాయుడు' - బిరుదు పుట్టుక — డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **కొల్లేజి ప్రక్రియ**

చిత్రకారుడు : **హసమన్**

Printed & Published by **Bapanna Alapati** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# LITERARY ANECDOTES

## CAEDMON (fl.670)

In the monastery of this abbess[1] there was a certain brother who was specially marked out by the grace of God, so that he used to compose godly and religious songs; thus, whatever he learned from the holy Scriptures by means of interpreters, he quickly turned into extremely delightful and moving poetry in English, which was his own tongue... He had lived in the secular habit until he was well advanced in years and had never learned any songs. Hence sometimes at a feast, when for the sake of Providing entertainment it had been decided that they should all sing in turn, when he was the harp approaching him, he would rise up in the middle of the feasting, go out, and return home.

On one such occasion when he did so, he left the place of feasting and went to the cattle byre, as it was his turn to take charge of them that night. In due time he stretched himself out and went to sleep, whereupon he dreamt that someone stood by him, saluted him, and called him by name: 'Cædmon,' he said, 'sing me something.' Cædmon answered, 'I cannot sing; that is why I left the feast and came here because I could not sing.' Once again the speaker said, 'Nevertheless you must sing to me.' 'What must I sing?' said Cædmon. 'Sing,' he said, 'about the beginning of created things.' Thereupon Cædmon began to sing verses which he had never heard before in praise of God the Creator, of which this is the general sense :

Now we must praise the Maker of the heavenly kingdom, the power of the Creator and His counsel, the deeds of the Father of glory, and how He, since He is the eternal God, was the Author of all marvels and first created the heavens as a roof for the children of men, and then, the Almighty Guardian of the human race, created the earth.

This is the sense but not the order of the words which he sang as he slept. For it is not possible to translate verse, however well composed, literally from one language to another without some loss of beauty and dignity. When he awoke, he remembered all that he had sung while asleep and soon added more verses in the same manner, praising God in fitting style.

In the morning he went to the reeve who was his master, telling him of the gift he had received, and the reeve took him to the abbess. He was then bidden to describe his dream in the presence of a number of the more learned men, and also to recite his song so that they might all examine him and decide upon the nature and origin of the gift of which he spoke; and it seemed clear to all of them that the Lord had granted him heavenly grace. They then read to him a passage of sacred history or doctrine, bidding him make a song out of it, if he could, in metrical form. He undertook the task and went away; on returning next morning he repeated the passage he had been given, which he had put into excellent verse. The abbess, who recognized the grace of God which the man had received, instructed him to renounce his secular habit and to take monastic vows. She and all her people received him into the community of the brothers, and ordered that he should be instructed in the whole course of sacred history. He learned all he could by listening to them, and then, memorizing it and ruminating over it, like some clean animal chewing the cud, he turned it into the most melodious verse: and it sounded so sweet as he recited it that his teachers became in turn his audience.

# హొజె డి ఎకెగరె ఐజాగురి

## (1904వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారోపన్యాసం)

మూలం: సి.డి. ఆఫ్ విర్సెన్ అనువాదం:- బి.వి. రామిరెడ్డి
(శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి)

గ్రీకు నాటకం తరువాతనే ఆంగ్ల, స్పానిష్ నాటక కళ అభివృద్ధి చెందింది. స్పానిష్ నాటకాన్ని అర్థం చేసుకోవాలంటే దాని వెనుక దాగి వున్న పాత తరాల జీవన పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలసి వుంటుంది. చాలా కాలం వరకు స్పానిష్ నాటకం ఘర్షణతో నిండి వుండేది. దానినిండా మాయమంత్రాలు నిండి వుండేవి. అక్కడక్కడ రంగులతోను, కవితాత్మకమైన వ్యతిరేక భావాలతోను నిండి వుండేది. హింస, సంగీతం అందులో భాగాలుగా వుండేవి. ఘర్షణలు విషాదాంత నిర్ణయాలతో నిండి వుండేవి. తాత్త్వికత బలంగా వుండేది. స్పానిష్ నాటకంలో కృతకత్వంలో ఒక సహజత్వం వుంది.

ఇలాంటి సంప్రదాయాన్ని ముందుకు తీసుకువెళ్ళిన రచయితను ఈ సంవత్సరపు నోబెల్ పురస్కారంలో సగం మొత్తంతో సమ్మానించాలని నిర్ణయించబడింది. స్వేచ్ఛను ప్రేమించే ఓర్పుకోసం పోరాడిన ఈ రచయిత స్పానిష్ నాటక కర్తల గౌరవాన్ని నిలబెట్టాడు. ఆయనే హొజెడి ఎకెగరె ఐజాగురి. తన ముందున్న నాటక కర్తలలాగానే ఈ రచయితకు అంతరాత్మకు సంబంధించిన సమస్యలు తెలుసు, అంతస్సంఘర్షణను ఎలా ప్రదర్శించాలో తెలుసు. ప్రేక్షకులలోని దయ, భయం లాంటి భావావేశాలను ఎలా ఉద్దీపింపజేయాలో తెలుసు. తన ముందు తరాల నాటక కర్తలలాగే భావనను కళాత్మకత ను అనుసంధించడం తెలుసు. ఈ విషయంలో ఆయన స్వచ్ఛమైన స్పానిష్ జాతీయుడు. ఆయనకు నీతితో కూడిన శూరత్వం ప్రీతి పాత్రమైనది. ఆయన ప్రపంచ మానవతను నమ్మినవాడు.

హొజెడి ఎకెగరె 1833లో మాడ్రిడ్‌లో జన్మించాడు. తన బాల్యాన్ని ముర్సియాలో గడిపాడు. అక్కడ అతని తండ్రి ఒక విద్యా సంస్థలో గ్రీకు పండితుడిగా పని చేస్తుండేవాడు. 14 సం॥ వయసులో డిగ్రీతీసుకుని, సివిల్ ఇంజనీరింగ్ స్కూలులో చేరాడు. అతనిలో గొప్ప సూక్ష్మ దృష్టి, అనుసంధాన శక్తి వుండేవి. అయిదేళ్ళ తరువాత 1853 లో తన ఇంజనీరింగ్ విద్యాభ్యాసాన్ని అత్యున్నత ప్రతిభతో పూర్తి చేశాడు. అతనికి గణితం అన్నా, మెకానిజం అన్నా విపరీతాభిమానం. ఒక సంవత్సరం తరువాత అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమితుడయ్యాడు. జీవనంకోసం అధ్యాపకుడిగా పనిచేస్తూ, ట్యూషన్లు కూడా చెప్పేవాడు. ప్రతిభావంతుడైన ప్రొఫెసరుగా, అత్యున్నత స్థాయి ఇంజనీరుగా ప్రసిద్ధుడయ్యాడు. ఆ కాలంలోనే పొలిటికల్ ఎకానమిని బాగా అధ్యయనం చేశాడు. ఆయన మూడు పర్యాయాలు తన దేశపు ప్రభుత్వంలో మంత్రిగా పని చేశాడు. పబ్లిక్ ఫైనాన్స్, పబ్లిక్ వర్క్సులో అద్భుతమైన పరిపాలనా దక్షత కనబరిచాడు.

ప్రొఫెసరుగా, పండితుడిగా, ఎనలిటిక్ జామెట్రి, ఫిజిక్స్, ఎల్క్ట్రిసిటీల మీద మంచి రచనలు చేసి ప్రచురించాడు. తన శక్తిని నాటక కళకు అంకితం చేశాడు. అతని నాటకాలలో గాఢమైన నీతి వాదం కనుపిస్తుంది. ఆయన స్కూలులో విద్యార్థిగా వుండగానే నాటకం అంటే అత్యంత ఆసక్తిని కనబరిచేవాడు. తను ఆదా చేసిన డబ్బును నాటకాల టిక్కెట్లకు ఖర్చు చేసేవాడు. 1865లో ''ది ఇల్లెజిటిమేట్ డాటర్'' అనే నాటకాన్ని, 1874లో ''బుక్ ఆఫ్ అకౌంట్స్'' అనే నాటకాన్నీ రచించాడు. ఆరోజుల్లో ఆయన స్పెయిన్‌కు ఆర్థిక శాఖా మంత్రిగా పనిచేస్తుండేవాడు. కొన్ని నెలల తరువాత ''ది లాస్ట్ నైట్'' నాటకం ప్రదర్శింపబడింది. ఒకే సంవత్సరంలో మూడు నాలుగు నాటకాలు రచించాడు.

1874లో రచింపబడిన ''ది ఎవెంజర్స్ వైఫ్'' తో ఎకెగరె నాటక రచనలో మేధావిగా గుర్తింపు

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

పొందాడు. ఆయన తన నాటకాలతో స్పానిష్ నాటక సాహిత్యాన్ని పూర్వపు స్వర్ణయుగానికి తీసుకు వెళ్ళాడని ప్రజలు భావించారు. స్పానిష్ నాటక కవిత్వాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ఆయనదే. ఆ తరువాత సంవత్సరం ''దిస్వోర్డ్స్ హాండిల్'' ప్రదర్శించాడు, దీనికి మంచి గుర్తింపు వచ్చింది. ఈ నాటకం ఆఖరి అంకం పూర్తయ్యాక ఎకెగరె స్టేజిమీదికి వచ్చి ప్రేక్షకులకు అభివాదం చేసేదాకా వారి చప్పట్లు ఆగలేదు. 1878లో రచించిన '' దిస్టేక్ అండ్ దిక్రాస్'' కొంత సంచలనాన్ని సృష్టించింది. ఈ నాటకంలో ఛాందసత్వానికి, మానవత్వానికి మధ్య ఘర్షణ ను చూపాడు. 1882లో ''కాన్ఫ్లిక్ట్ ఆఫ్ డ్యూటీస్'' ప్రచురించాడు. ఈ సంఘర్షణ దాదాపు ఆయన నాటకాలన్నింటిలోను కనుపిస్తుంది. మరో రెండు నాటకాలు అతనికి మంచి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టాయి. వీటిలో మొదటిది '' మాడ్ మాన్ ఆర్ సెయింట్'', రెండోది '' గ్రేట్ గలెటో''. మొదటి నాటకం 1877 జనవరిలోను, రెండవది మార్చి 1881లోను ప్రదర్శింపబడ్డాయి. ఈ మొదటి నాటకంలో గొప్పభావాలు, సృజనాత్మకత వున్నాయి. ఇందులో ఒక వ్యక్తి నిజాయితీతో తన ఆస్తులను, సంపదను త్యాగంచేస్తాడు. దాంతో లోకులు, మిత్రులు అతణ్ణి పిచ్చివాడిగా భావిస్తారు. అలాంటి త్యాగాన్ని అతని కుటుంబ సభ్యులే పిచ్చితనంగా భావిస్తారు. అందరూ అతణ్ణొక డాన్ క్విక్సోట్‌లాగ చూస్తారు. అతనిలోని అంతస్సంఘర్షణను రచయిత గొప్పగా చిత్రీకరిస్తాడు. ఈ సంఘర్షణ విధి నిర్వహణకు, అవకాశవాదనికి మధ్య ఉత్పన్నమవుతుంది. అతని అంతరాత్మ నిర్దేశం అతణ్ణొక త్యాగాజీవిని చేస్తుంది. అంతరాత్మ ప్రకారం నడుచుకునే వారు త్యాగ జీవులు కావడానికి సిద్ధపడాలని ఈ నాటకం రుజువు చేస్తుంది.

ఈ రచన వెలువడిన మొదటి నెలలోనే అయిదుసార్లు పునర్ముద్రణ పొందింది. '' గ్రేట్ గలెటో'' లోని ఎర్నెస్టో, టియొడోరా ప్రజల రూమర్ల వల్ల, పుకార్ల వల్ల ఒకరినొకరు పెళ్ళి చేసుకోవలసి వస్తుంది. ఇందులోని మానసిక విశ్లేషణ గొప్పది. ఈ నాటకంలోని భావవాదం, కవితా సౌందర్యం మరువరానివి.

నాటక కర్తగా ఎకెగరె తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే వున్నాడు. 1904లో ''ది డిస్టర్బ్ వుమన్'' అనే నాటకాన్ని ప్రచురించాడు. ఇందులోని డాన్ మార్సియోడి వర్గాస రచయిత క్లిష్టమైన ధీరత్వానికి ప్రతినిధి. అతడు తన సంతోషం కోసం, సౌఖ్యంకోసం తన విధిని త్యాగంచేయలేడు. అలాంటి ఆదర్శాలు కలిగిన గొప్ప కవికి నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయాలని నిర్ణయించబడింది. ఎకెగరె తన '' గ్రేట్ గలెటో'' నాటకంలోని ఒక పాత్ర చేత ప్రపంచాన్ని గురించి నిరాశాపూరితమైన మాటలు - '' ఈ ప్రపంచం అర్థంకాని గొప్ప భవిష్యద్రష్టను అతను చనిపోయాక మూడు శతాబ్దాల వరకు గుర్తించదు'' అని పిస్తాడు.

అలాంటిది సంభవమే. కాని ఎకెగరె రచనలమీద ప్రజల అభిమానానికి గాను స్వీడిష్ అకాడెమి ఆయనకు నోబెల్ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నది.

**జీవిత చరిత్ర :**

హొజెడి ఎకెరగె (1833-1916) ఒక గ్రీకు భాషాచార్యుడి కుమారుడు. మాడ్రిడ్‌లో జన్మించాడు. ఇంజనీరింగ్ స్కూలుకు వెళ్ళాడు; ఆర్థిక శాస్త్రం చదివాడు. స్పానిష ప్రభుత్వంలో ప్రముఖుడయ్యాడు. పబ్లిక్ వర్క్స్, ఆర్థిక శాఖల మంత్రిగా పని చేశాడు. బాల్యం నుండి తనకిష్టమైన నాటక రచనకు పూనుకున్నాడు. గణితశాస్త్రవేత్త, ఇంజనీరు, పరిపాలనా దక్షుడు అయిన ఇతడు తన నాటకాలతో తన దేశ ప్రజా జీవితాన్ని ప్రభావితం చేశాడు. విధి నిర్వహణకు సంబంధించిన అంతస్సంఘర్షణ అతని నాటకాలన్నిటిలోను ప్రధానంగా కనుపిస్తుంది. ఆయన స్పానిష నాటకాన్ని తన పూర్వీకుల స్వర్ణయుగానికి తీసుకువెళ్ళాడు. అతని ప్రసిద్ధ నాటకాలు : - ''ది ఎవెంజర్స్ వైఫ్'' (1874); ''ది స్వోర్డ్స్ హాండిల్'' (1875); ''ది స్టేక్ అండ్ ది క్రాస్'' (1878); ''కాన్ఫ్లిక్ట్ ఆఫ డ్యూటీస్'' (1882); ''మాడ్‌మాన్ ఆర్ సెయింట్'' (1877); ''గ్రేట్ గలెటో'' (1881).

# క్లోనింగ్

- కొసరాజు వెంకటేశ్వర రావు

భూమి పైన జీవుల ఆవిర్భావం జరిగి 300 కోట్ల సంవత్సరాలు గడిచింది. అప్పటి నుండి నిరంతరం సాగిన పరిణామ ప్రక్రియ వల్ల ఎన్నో రకాల జాతులు ఉద్భవించాయి. జీవజాతుల ఉనికి, పరివ్యాప్తి వాటి ప్రత్యుత్పత్తి ప్రక్రియపై ఆధారపడుతుంది. ప్రకృతిలో పలు రకాల ప్రత్యుత్పత్తి విధానాలు అమలులో ఉన్నాయి. వాటిలో క్లోనింగ్‌ను ఒక ప్రత్యేకమైన విధానంగా పేర్కొనవచ్చు. అలైంగిక మార్గం వల్ల ఏర్పడిన జన్యు సారూప్యత గల జీవ రాసులను ''క్లోన్స్'' అని, వాటి ఉత్పత్తి విధాన ప్రక్రియను 'క్లోనింగ్' అని పేర్కొంటారు. వాస్తవానికి ఈ పద్ధతి కొత్తదేమీ కాదు. క్లోనింగ్ అనే పదం ఒక శతాబ్ది నుండి వాడుకలో ఉంది. నిమ్న స్థాయి జీవుల్లో క్లోనింగ్ ద్వారా పునరుత్పత్తి జరగటం సర్వసాధారణం. ఉదాహరణకు 'అమీబా' అనే ఏకకణ జీవి విభజన చెంది రెండు ఏకకణ జీవులుగా రూపొందుతాయి. అమీబా ఎప్పుడూ సహజ మరణానికి దూరంగానే ఉంటుంది. ఒక తల్లి కణం రెండు పిల్ల కణాలుగా రూపొందుతూ నిరంతరం సాగిపోయే ఈ చర్యవల్ల అమీబాను అమరజీవిగా పేర్కొంటారు. కొన్ని ప్రాణులు ప్రాకుతూ కదలిపోతుంటాయి. వాటిని ఖండించినప్పుడు ఏర్పడిన ప్రతి ఖండం స్వతంత్ర జీవిగా ఎదగ గలుగుతుంది. మొక్కల్లో ఏర్పడే ప్రరోహాలు (buds), అంకురణ (sprouting) వంటి ప్రత్యుత్పత్తికి దోహదపడే విధానాలు, బంగాళాదుంపలు, వెల్లుల్లి, ద్రాక్ష, పైన్ ఆపిల్, చెరకువంటి మొక్కల్లో జరిగే పునరుత్పత్తి క్లోనింగ్‌కు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. వీటిలో లైంగిక ప్రక్రియ ప్రమేయం ఏ మాత్రం లేదు.

వాస్తవానికి పునరుత్పత్తి విధానాల్లో లైంగిక ప్రక్రియ అతి ముఖ్యమైన సాధనమని పేర్కొన నవసరం లేదు. మగ, ఆడ కలయిక వల్ల ఆవిర్భవించిన సంతానం మరింత ఆమోదయోగ్యమైనదిగా ప్రకృతిలో స్థిరపడింది. మగ, ఆడ సంయోగ బీజాల కలయిక వల్ల సంయుక్త బీజం ఏర్పడుతుంది. సంయుక్త బీజం పిండంగా ఎదిగి విభేదనం చెంది చివరకు స్వతంత్ర జీవిగా ఆవిర్భవిస్తుంది.

స్త్రీతో ప్రమేయం లేకుండా కేవలం పురుషుడు తనంతట తానుగా తన జాతి జీవుల పునరుత్పత్తిని సాధించగలుగుతాడా? అటువంటి సాధన సంపత్తి లేదని ఇప్పటివరకు జరిగిన శాస్త్ర పరిశోధనలవల్ల స్పష్టమయింది. ఇందుకు భిన్నంగా పురుషులతో ఎటువంటి ప్రమేయం లేకుండా స్త్రీలకు తమ జాతి జీవులను పునరుత్పాదన చేయగల సమర్ధత ఉందని శాస్త్రపరిశోధనల వల్ల రుజువయింది. నూతన సాంకేతిక పద్ధతులను వినియోగించి చేసిన ప్రయోగాల వల్ల శాస్త్రజ్ఞులకు ఇది సుసాధ్యమయింది.

ప్రకృతిలో క్లోనింగ్ ఒకవైపు స్వాభావికంగా కొనసాగుతుంటే మరోవైపు మానవ ప్రయత్నంతో వినూత్నమైన ఫలితాలు అందాయి. ఉచ్ఛ స్థాయికి చెందిన జీవుల్లో నూతన సాంకేతిక పద్ధతులను అవలంభించటం వల్ల క్లోనింగ్‌కు మరింత ప్రాచుర్యం లభించింది. 1980 ప్రాంతంలో ఫిలడెల్ఫియా నగరంలో జేమ్స్ మెగ్రాత్ (James Magrath), డార్ సోల్టర్ (Daar Solter) లు ఆడ బీజ కణానికి శాఖీయ కణాన్ని జత చేసి ప్రప్రథమంగా క్షీర జాతికి చెందిన చిట్టెలుక (Mouse)ను రూపొందించారు.

---

కొసరాజు వెంకటేశ్వర రావు, రిటైర్డు లెక్చరర్, నాజర్‌పేట, తెనాలి.

లైంగిక విధానంలో ఆడ, మగ సంయోగ బీజాల కలయిక వల్ల సంయుక్త బీజం ఏర్పడుతుందని గతంలో ఉదహరించబడింది. అలా ఏర్పడిన సంయుక్త బీజం, ఎన్నో శాఖీయ కణాలతో నిండిన ఒక స్వతంత్ర జీవిగా ఎదగటానికి అవసరమయ్యే లక్షణాలన్నింటినీ కలిగి ఉంటుంది. కేంద్రకాన్ని తొలగించిన స్త్రీ బీజకణంలోనికి శాఖీయకణం నుంచి సేకరించిన కేంద్రకాన్ని ప్రవేశపెట్టినప్పుడు స్త్రీ బీజంలో ఉండే కణ ద్రవ్యం (cytoplasm) జాగృత మవుతుంది. స్వతంత్ర జీవిగా వికాసం చెందటానికి అవసరమయ్యే చర్యలు వెంటనే మొదలవుతాయి. కణ విభజనల వల్ల ఏర్పడిన కణాలు విభేదనం చెంది మెదడు, చర్మం, రక్తకణాలు, కాలేయం వంటి శరీర భాగాలుగా రూపొందుతాయి. విభేదనం చెంది ఏర్పడిన ప్రత్యేక కణాలు వేరొక విశిష్ట కణంగా రూపాంతరం చేందే సామర్థ్యాన్ని కోల్పోతాయి. ఉదాహరణకు నాడీ కణాలు కాలేయ కణాలుగా రూపొందవు.

దేహంలోని ప్రతి శాఖీయ కణంలోను స్త్రీ, పురుష బీజ కణాలందించిన రెండు జన్యుప్రతులుంటాయి. సంయోగ బీజకణాల్లో ఒక జన్యు ప్రతి మాత్రమే ఉంటుంది. జన్యువు మాంసకృత్తులను ఉత్పత్తి చేసే ఉపకరణాలను కలిగి ఉంటుంది. కణంలోని ఏదైనా ఒక జన్యువు ఉత్పరివర్తన (Mutation) చెంది తన క్రియా శీల లక్షణాలను కోల్పోయినప్పుడు, అదే కణంలో ఉన్న రెండవ జన్యు ప్రతి వెంటనే చురుకుగా కార్య నిర్వహణను చేపడుతుంది.

లైంగిక విధానం వల్ల రూపొందిన జీవుల్లో అభిలషణీయమైన ఎన్నో వైవిధ్య లక్షణాలు గోచరిస్తాయి. వాంఛనీయమైన జన్యు రూప ఆవిష్కరణ జరుగుతుంది. క్లోనింగ్ వల్ల ఏర్పడ్డ జీవుల్లో వైవిధ్యానికి విఘాతం కలుగుతుంది. క్లోనింగ్‌తో పోల్చి చూస్తే లైంగిక విధానంలో శక్తి, సమయం, సాధనాలు, వనరులను అధిక నిష్పత్తిలో వినియోగించవలసి ఉంటుంది.

**డాలీ**

''డాలీ'' అనే పేరు వినడం తోటే ఇదేదో పెంపుడు కుక్కకు పెట్టిన పేరు అనిపిస్తుంది. వాస్తవానికి అది పెంపుడు జంతువుకు పెట్టిన పేరే! అయితే అది ఎంతో ప్రాచుర్యం పొందిన ''గొర్రె'' కు పెట్టిన పేరు. ప్రపంచమంతటా 'డాలీ' దృశ్య, శ్రవణ, ముద్రణామాధ్యంలో బహుళ ప్రచారం పొందింది. 1998 జూలైలో డాలీ తన రెండవ జన్మ దినోత్సవ వేడుకను జరుపుకొంది. దీని చిరునామా స్కాట్లాండ్‌లోని రోజిలిన్ ఇన్‌స్టిట్యూట్.

డాలీ పుట్టుకకు మూలం ఒక ఎదిగిన శాఖీయ కణం అని చెప్పవచ్చు. శరీరాల్లో తయారయ్యే ఆడ, మగ బీజ కణాలు మినహా మిగిలిన కణాలన్నింటినీ జన్యుపరంగా శాఖీయ కణాలని పేర్కొనవచ్చు. ఎన్నో అవరోధాలను అధిగమించి జన్యు ఇంజనీరింగ్ నైపుణ్యంతో శాఖీయ కణం నుంచి ఆవిర్భవించిన ఒక సజీవ రూపంగా డాలీని పేర్కొనవచ్చు. అన్ని జంతువుల వలె కాకుండా క్లోనింగ్ వల్ల పునరుత్పత్తి చెంది, ఎదిగిన మొట్టమొదటి గొర్రె కావటం చేత అది ఒక అద్వితీయమైన ప్రత్యేకతను సంతరించుకొన్న జంతువుగా గుర్తింపు పొందింది. డా॥ యాన్ విల్‌మట్ (Dr. IanWilmut) తాను ఎంచుకొన్న ఒక మేలు రకం గొర్రెలోని జననేంద్రియ మండలం నుంచి ఒక అండాన్ని, పొదుగు నుంచి ఒక శాఖీయ కణాన్ని సేకరించాడు. అండంలోని కేంద్రకాన్ని తొలగించి ఆ స్థానంలో శాఖీయ కణ కేంద్రకాన్ని ప్రవేశపెట్టాడు. అండంలోని కణ ద్రవ్యం + బదిలీ అయిన శాఖీయ కణ కేంద్రకంతో ఏర్పడిన ఈ

నూతన కణం అనేక విభజనలు చెంది పిండంగా అభివృద్ధి చెందటం గమనార్హం. ఆ తరవాత చర్యగా ప్రయోగశాలలోని పిండాన్ని ''అద్దె తల్లి'' గర్భంలోనికి ప్రవేశపెట్టబడింది. దాత గర్భంలో పూర్తిగా ఎదిగి ప్రసవించగా ప్రకృతిని చూసిన ఆరోగ్యవంతమైన గొర్రెపిల్లనే ''డాలీ'' అని పిలిచారు. అది అన్నివిధాలా తన తల్లికి (కవలలు) నమూనా ప్రతిగా నిలిచింది.

ఎడింబర్గ్‌లోని రోజ్‌లిన్ సంస్థ ఆవరణలో 1996 జులై నెలలో డాలీ జన్మించింది. జన్మ వివరాలను కొన్ని నెలల వరకు రహస్యంగా ఉంచారు. 1997 ఫిబ్రవరిలో పుట్టుక వివరాల గురించిన ప్రకటన ప్రపంచమంతటా సంచలనం సృష్టించింది. ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది.

డాలీ ''ఫిన్ డార్‌సెట్'' (Fin Dorset) అనే జాతికి చెందిన గొర్రె. తెల్లని ముఖం, ఉంగరాలు తిరిగి క్రీమ్ రంగులో ఉన్న ఉన్నితో శరీరమంతా కప్పబడి ఉంటుంది. డాలీ ప్రత్యేకంగా చేతులతో అందించిన ఆహారాన్ని మాత్రమే అందుకొన్న అపురూపమైన జంతువు. బాల్యంలోనే కాకుండా ఎదిగిన తరవాత కూడా తనను పెంచిన వారి స్నేహాన్ని, ప్రేమానురాగాలను అందుకొంది.

డాలీ పుట్టుకకు కొన్ని సంవత్సరాల ముందే డాలీ తల్లి (twin - కవల) చనిపోవటం గమనార్హం. తల్లి పొదుగు నుంచి సేకరించి అతిశీతల స్థితిలో నిలవచేసిన శాఖీయ కణమే డాలీ పుట్టుకకు ప్రధాన భూమిక అయింది. డా॥ విల్‌మట్స్ డాలీ తల్లికి అమెరికన్ గాయని పేరు డాలీ పార్టన్ (Dally Porton) అని పేరు పెట్టాడు. విల్‌మట్స్ బృందం క్లోనింగ్ ద్వారా పునరుత్పత్తి జరపాలనే ప్రయత్నంలో పొదుగు నుండి 277 శాఖీయ కణాలను ఎంపిక చేశారు. ఈ కణాల నుండి సేకరించబడిన కేంద్రకాలలో 29 మాత్రమే ఆడ బీజ కణాలలో స్థిరపడి ఆ తరవాత పిండాలుగా వృద్ధి చెందాయి. పిండాలను 13 అద్దె తల్లుల గర్భ సంచిలలోనికి విడివిడిగా ప్రవేశపెట్టగా వాటిలో ఒకటి మాత్రమే ఎదిగి ''డాలీ''గా ప్రసవించబడింది.

గొర్రెల సగటు జీవన ప్రమాణం 12 సం॥ అయినప్పటికీ డాలీ 6 సం॥ వయసులోనే 14 ఫిబ్రవరి 2002న మరణించింది. ఊపిరితిత్తులకు సోకిన వైరల్ వ్యాధి క్రమంగా ముదరటం వల్ల మరణం ప్రాప్తించింది. వైరస్ పరిసర ప్రాంతాల్లో నివసించే ఇతర గొర్రెల నుండి సంక్రమించిందని ధృవపడింది. మెసాచెట్స్ (Massachwetts) కు చెందిన క్లోనింగ్ పరిశోధనల్లో నిపుణుడైన రాబర్ట్ లాంజీ (Dr. Robert Lanza) పెంపుడు జంతువుల్లో కీళ్ళ నొప్పులు, శ్వాసకోశ వ్యాధులు ఆ వయసులో సంక్రమించటం సహజమేనని పేర్కొన్నాడు. క్లోనింగ్ వల్ల పునరుత్పత్తి చెందిన జంతువుల్లో అంతర్లీనమైన ప్రమాదానికి డాలీ మరణం ఒక సాక్ష్యంగా పేర్కొనవచ్చు అనే భావన కూడా లేకపోలేదు. ఏది ఏమైనా ఈ సంఘటన శాస్త్రవేత్తలను దిగ్భ్రాంతికి గురి చేసింది.

డాలీ తరవాత క్లోనింగ్ పద్ధతిలో ఎన్నో ఆవులు, మేకలు, పందులు, కుందేళ్ళ వంటి క్షీరదాలు వందల సంఖ్యలో రూపొందాయి. వాటి ఆవిర్భావం గురించి, మంచి చెడుల గురించి వెలిబుచ్చిన అభిప్రాయాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమయింది. మిశ్రమ స్పందనకు కారణం క్లోన్డ్ జంతువుల్లో అకాల మరణం, మితిమీరిన స్థూలకాయం, అకాల వార్ధక్య లక్షణాలు మొదలైనవి. వాస్తవానికి డాలీలో కూడా నడి వయస్సులోనే కీళ్ళ నొప్పులు, అకాల వార్ధక్య లక్షణాలు పొడసూపాయి. తన సంతతికి చెందిన జంతువులు స్కాట్లండ్‌లు ఏటవాలుగా ఉండే కొండ అంచుల్లో పచ్చిక మేస్తుంటే ''డాలీ'' ది

కేవలం గృహజీవనం. సందర్శకులు అందించే ఆహారాన్ని చిక్కం అమర్చిన నోటితో అందుకొనే ప్రయత్నం, వాసన చూడటం, ముట్టెతో పొడిచే లక్షణాల వల్ల వెనుక కాళ్ళతో ఎక్కువగా వ్యాయామం జరిపే ఆవశ్యకత ఉండేది. కీళ్ళవాపులకు ప్రధానమైన కారణం అటువంటి వ్యాయామమేనని, ఆహారం ఇతరమైన కారణాలు కాకపోవచ్చని అభిప్రాయ పడ్డారు. క్లోనింగ్ ననుసరించి పునరుత్పత్తి చెందిన క్షీరదాలు ప్రజననానికి (breeding) అయోగ్యులనే భావన ఉండేది. డాలీ నాలుగు గొర్రె పిల్లలకు తల్లి కావటంతో (లైంగిక మార్గంలో) అటువంటి భావన నిజం కాదని రుజువయింది.

సేద్యం, వైద్యం, మాంసం కొరకు వినియోగించే జంతువుల ఉత్పత్తిని క్లోనింగ్‌తో నిర్వహించటం నిత్యకృత్యంగా మారింది. ఈ విధానంలో తయారైన పందులకు జన్మించిన సంతానాన్ని మాంసం కొరకు మార్కెట్‌లో విరివిగా విక్రయించటం గత 5, 6 సంవత్సరాల నుండి సర్వ సాధారణ మయింది.

డాలీ సృష్టి పథానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞాన హక్కులను కాలిఫోర్నియాకు చెందిన జెరాన్ (Geron) అనే సంస్థ కొనుగోలు చేసింది. జెరాన్ షేర్ల విలువ డాలీ మరణించిన రోజున 16% తగ్గిపోవటం గమనార్హం.

జీవ సాంకేతిక పరిజ్ఞాన ఆచరణతో శాస్త్రవేత్తలచే సృష్టించబడి, దార్శనికులకు చర్చా వస్తువై, జంతు వైద్యుల సమక్షంలో మరణించి, చర్మ కళాకారుల నైపుణ్యంతో శవదశ నుండి కృత్రిమంగా రూపాంతరం చెంది మరొకసారి కృత్రిమమైన సజీవ రూపాన్ని సంతరించుకొని వస్తు ప్రదర్శన శాలలో ప్రదర్శనా వస్తువుగా మారి సందర్శకులకు ఎంతగానో ఆనందాశ్చర్యాలను కలుగచేస్తున్న 'డాలీ' ఎప్పటికీ శాస్త్ర రంగంలో క్లోనింగ్ వల్ల ఏర్పడి ఎంతో ప్రాచుర్యం పొందిన మొట్టమొదటి సజీవ రూపంగా నిలిచి పోతుందనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

★ మానవ జాతి పునరుత్పత్తి క్లోనింగ్ ద్వారా జరుపుట అభిలషణీయమే అనే భావనకు ఈక్రింది అంశాలను పరిగణనలోనికి తీసుకోవచ్చు.

1. దూరమై పోయే ఆత్మీయుల రూపాలను సజీవంగా మనముందుండే అవకాశాన్ని పొందవచ్చు.
2. లైంగిక నిష్ఫలతను అధిగమించవచ్చు. వ్యక్తి శాఖీయకణాన్ని వినియోగించి అటువంటి వ్యక్తినే పునరుత్పాదన గావించి జీవన స్రవంతిలో భాగస్వామిని చేయవచ్చు.
3. అభిలషణీయమైన జాతిని వృద్ధి చేసుకోవచ్చు.
4. అనారోగ్యవంతుల్లో అవయవాల మార్పిడికి అవసరమయినప్పుడు శరీర భాగాలను తేలికగా సమకూర్చుకునే అవకాశం కలుగుతుంది.
5. వైద్య పరిశోధనల పురోగతికి ఎన్నో విధాలుగా వినియోగ పడుతుంది.
6. నిబిడీకృతమైన శాస్త్ర ప్రయోజనాల ఆవిష్కరణకు ఈ ప్రయోగాలు ఎంతగానో ఉపకరిస్తాయి.
7. తమ ప్రాధాన్యాన్ని మాత్రమే కోరుకొంటూ మహోన్మాదంతో ప్రవర్తించేవారు (Megalomaniaes) కూడా వారి సంతతిని పెంచుకొనే ఆయుధంగా వాడుకొనే ప్రమాదం పొంచి వుంది.

# రాధాకృష్ణన్ విద్యాతత్వం

– డా॥ బి.వి.ఎస్. భానుశ్రీ

ఎవరయినా ఒకసిద్ధాంతాన్ని ప్రతిపాదించారంటే అది జీవితంపట్ల వారి దృక్పథాన్ని, అవగాహనని తెలియజేస్తుంది. లోతైన తాత్విక చింతనలోంచి సమర్థవంతమైన సిద్ధాంతాలెప్పుడతాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తత్వవేత్తేకాదు, విద్యావేత్తకూడ. తాత్వికుని దృష్టి, విజ్ఞత- విద్యావేత్త ఉత్సాహం, పట్టుదల కలిస్తే ఆదర్శవంతమైన ఫలితం ఉంటుంది. తాత్విక నేపథ్యంతో పెంపొందించబడిన ఎటువంటి విషయం అయినా ఎంతో ఉన్నతంగా, గుణాత్మకంగా ఉంటుంది. ఎందుకంటే సరైన దారిలోపెట్టి, ఒక అర్థాన్ని కల్పించి జీవితాన్ని ఉన్నత పథాల్లో నడిపించేది తత్వజ్ఞానం.

రాధాకృష్ణన్ దృష్టిలో జీవితం అర్థవంతమైంది. దానికో ఉద్దేశ్యం ఉంది, లక్ష్యం ఉంది. ఆదర్శాలు, విలువలు జీవితంలో లక్ష్య సాధనకి ఉపయోగపడే శక్తులు. ప్రపంచమంతా ఒక సంపూర్ణత్వం యొక్క వ్యక్తీకరణే. అందులోని అంశే మానవుడు. సత్యం కోసం అతని వెతుకులాట, సంపూర్ణ సిద్ధికై పెనుగులాట, మంచితనం కోసం తపన, సౌందర్యపిపాస, అతని ఆదర్శాలు, సంకల్పాలు - అన్నీ ఈ విషయాన్ని నిరూపిస్తూనే ఉంటాయి.

అయితే మనిషి Complex multi dimensional being అన్నది కూడా నిజమే. కేవలం ఆత్మేకాదు, అతనికి మనసు, శరీరం కూడ ఉన్నాయి. అయితే అతని స్వభావంలోని ఈ విభిన్నకోణాలు పరస్పర విరుద్ధమైనవికావు. అతని అస్తిత్వం అవిభాజ్యమైనది. అతనిలోని ప్రతి అణువు కాదనలేనిదే!

1948-49లో ఏర్పడిన యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమీషన్‌కి రాధాకృష్ణన్ చైర్మన్‌గా చేశారు. దాని రిపోర్ట్‌లో ఆయన విద్యకి సంబంధించిన అభిప్రాయాలను కూలంకషంగా వివరించారు. మనిషి సంఘజీవి. చక్కగా నిర్మింపబడిన సంఘంలో తన సహచరులతో కలిసి జీవించడం అతనికిష్టమైన విషయం. సమాజాన్ని నిర్మించడం నాగరికత యొక్క స్వభావం, ఆశ, లక్ష్యం. అటువంటి వాటికి విద్యా వ్యవస్థ మార్గదర్శకం కావాలని కమీషన్ రిపోర్ట్ వ్యక్తపరచింది. సామాజిక దర్శనం స్పష్టంగా ఉండాలి. రాధాకృష్ణన్‌కి ప్రజాస్వామ్యంమీద ఎంతో నమ్మకం ఉంది. వ్యక్తి యథార్థంగా అభివృద్ధి చెందాలంటే అది 'డెమొక్రసీ' తోనే సాధ్యం అని ఆయన ఉద్దేశ్యం. ప్రజాస్వామ్య సూత్రాలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అవగాహన చేసుకుని, ఆకళింపు చేసుకునే విధంగా మన విద్యావిధానపు తీరుతెన్నులుండాలని రిపోర్టు స్పష్టపరిచింది. అయితే వీటిని గుర్తించినంత మాత్రాన, రాజ్యాంగంలో పొందుపరచినంత మాత్రాన ప్రజాస్వామ్యం ఏర్పడిపోదు. అవి సమాజం అనే వస్త్రంలో పడుగు, పేకల్లా సహజంగా అల్లుకుపోవాలి. ప్రజాస్వామ్యం అంటే వ్యక్తిలోని అంతర్గతమైన అర్హతను గౌరవించి, మానవ జీవితంలోని గొప్పదనం, ఘనత, విలువలపై నమ్మకం కలిగించడం, ప్రతివ్యక్తి జీవితం ఒక అద్వితీయ సాహసంతో కూడినది. ఈ వాస్తవ ప్రపంచాన్ని అర్థంచేసుకునే సందర్భంలో విద్య వ్యక్తిలో అంతర్లీనంగా ఉన్నశక్తులను గ్రహించేవిధంగా జీవితాన్ని నడిపించే లక్ష్యం కావాలి. అంతేకాదు, వ్యక్తిలోని ప్రత్యేక బౌద్ధిక సామర్థ్యాలు సమాజ హితం కోసం ఉపయోగపడేలా వెలికితీసి, శిక్షణనిచ్చి అతన్ని అభివృద్ధిచెయ్యాలి విద్య.

మనిషి ఎంత సంఘజీవి అయినా తనలోనే, తనదంటూ స్వంత ఆలోచనలు ఊహలు, ఉద్వేగాలవంటి సున్నిత భావాలతో కూడిన ఒక ప్రపంచం ఉంటుంది. ఆ ప్రపంచాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యానికుంది. వ్యక్తి తన విలువను తను తెలుసుకుని తనలోని సంపూర్ణత్వాన్ని గౌరవించుకునేలా శిక్షణపొందాలి; అప్పుడే అతని మనసు, ఆత్మ వికసించి ఇతరులను

---

డా॥ బి.వి.ఎస్. భానుశ్రీ, ఆంధ్రాయూనివర్శిటీ ఫిలాసఫీ డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, విశాఖపట్టణం.

అర్థంచేసుకోగలుగుతాడు. దేన్నయినా భరించలేకపోవడం, సహించలేకపోవడం అనే భావాలు మాలిన్యంతో కూడినవి. మన విద్యా విధానంలో ఈ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం లేకపోతే దాని ఉద్దేశ్యమే నాశనమైపోతుంది. ఒక సంస్కృత శ్లోకంలో చెప్పినట్టు (సాక్షరో వాపరీత్వే రాక్షస భవతి ధృవమ్), ఎంత చదువుకున్నా ప్రేమించే గుణం లేకపోతే మనిషి రాక్షసుడిలా తయారవుతాడు.

విద్యఅనేది కేవలం పైనించి విధించే విధానం కాదు. అంతః స్వభావం వేయి పుష్పాలుగా వికసించే ఒక క్రమపద్ధతి. ఇదొక నిరంతర క్రమం. ఒక సంస్కృత శ్లోకంలో చెప్పిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం అప్రస్తుతంకాదు: మనిషి తన జీవితంలో నేర్చుకున్న విద్యలో పావువంతు గురువు నుండి గ్రహిస్తాడు; తరవాతి పావు తన బౌద్ధిక ప్రయత్నం వలన, మరోపావు తన సహవిద్యార్థుల వలన, మిగతాది తన స్వంత అనుభవాల వలన గ్రహిస్తాడు.

రాధాకృష్ణన్ అభిప్రాయంలో అస్తిత్వం - స్వాభావికం, సామాజికం, ఆధ్యాత్మికం అని మూడు విధాలుగా ఉంటుంది. ఈ మూడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నవే. దీన్ని ఆధారం చేసుకుని అధ్యయనాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. ప్రకృతితో మనకున్న సబంధాన్ని తెలిపే 'సైన్స్ అండ్ టెక్నాలజీ', సమాజంతో సంబంధాలను వివరించే 'సోషల్ సైన్సెస్', మానవ విలువలకి, ఆధ్యాత్మిక ప్రపంచానికి సంబంధించిన 'హ్యూమానిటీస్'. ఇవన్నీ శరీరంలోని అవయవాల్లా, చెట్టు యొక్క కొమ్మల్లా, ఒక గొప్ప సంపూర్ణత్వంలోని భాగాలే. ఈ సంపూర్ణత్వం ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మికతవైపు ప్రయాణించే ఏకాండీ విషయం. సత్యానికి సంబంధించిన మర్మాలను తెలుసుకునే ప్రయత్నంలో విజ్ఞానశాస్త్రం కొంతవరకు సహాయం చేస్తుంది. మన చుట్టూ ఉన్న సృష్టి రహస్యాలను కొంతయినా అర్థంచేసుకోగలగడం మనసు చేసే సాహస కృత్యమే. సాహిత్యం ఒక విధమైన నైతిక దృష్టిని, మనిషి భావాలని, భావోద్వేగాల జ్ఞానాన్నిస్తుంది. కళలయితే మన జ్ఞానేంద్రియాలనే కాక మన హృదయపు లోతుల్ని స్పృశించే ఔన్నత్యం కలవి. ఈ స్పర్శ మన అస్తిత్వాన్ని తుడిచిపెట్టేసి విలువలతో కూడిన ఒక కొత్త ప్రపంచాన్ని చూడగలిగే దృష్టినిస్తుంది. ఈ భాగాలన్నీ పరస్పర సంబంధం కలవి, వాస్తవాలకి, సంఘటనలకి, విలువలకి సంబంధించినవి. ఈ ఆధునిక ప్రపంచంలో ప్రతివారికీ ఈ రంగాలకి సంబంధించిన కొంతయినా జ్ఞానం ఉండడం అవసరం. మానవ ఆత్మకి సంబంధించిన ఎటువంటి వ్యక్తీకరణనయినా అలక్ష్యంచేస్తే అది విద్యేకాదు.

స్వేచ్ఛా సమాజాన్ని కోరుకునేవారు, అందులో నివసించేవారు స్వేచ్ఛాపౌరులు. స్వేచ్ఛ అంటే కేవలం బయటినించి అదుపులేకపోవడమేకాదు; నిజమైన స్వేచ్ఛ అంతరంగికమైనది. అది మనసు, ఆత్మల యొక్క సహజ ధర్మము. మనిషి-తప్పు- ఒప్పు, మంచి-చెడులలో ఏదో ఒకదాన్ని ఎన్నుకోగలిగిన సామర్థ్యంగల నైతిక ప్రతినిధి- అన్న నమ్మకమే స్వేచ్ఛాసారం. నైతికమైన స్వేచ్ఛలేనప్పుడు ప్రజాస్వామ్యం వెలవెలబోతుంది. రాధాకృష్ణన్ మాటల్లో చెప్పాలంటే 'నిజమైన ప్రజాస్వామ్యం ఏక లక్ష్యంతో ఉన్న వివిధ రకాలైన పౌరులతో కూడిన సంఘం'. స్వేచ్ఛాయుతమైన మనసు-గుడ్డి నమ్మకాలకు, క్షణికమైన నినాదాలకు లొంగిపోదు.

పేదరికం రోగాలు, ఆకలి, అజ్ఞానం లేని సమాజాన్ని సృష్టించాలన్నది సామాజిక న్యాయం యొక్క లక్ష్యం. శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఉపయోగాల సహాయంతో- భౌతిక జీవన ప్రమాణాలు పెరగాలని, జాతీయ ఉత్పత్తి వృద్ధిచెందాలని రాధాకృష్ణన్ స్థిరంగా చెప్పారు. ప్రజాస్వామ్య సూత్రాలైన న్యాయం, నిర్భయత్వాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే 'సైన్స్ అండ్ టెక్నాలజీ' తప్పనిసరిగా వృద్ధిచెందాలి. సరయిన సామాజిక దృష్టిని కలిగించడం విద్యయొక్క ప్రధానమైన పని. డాక్టర్లు, ఇంజనీర్లు గొప్ప సామాజిక లక్ష్యాల వలన ప్రేరేపితులైనపుడే, మెడిసిన్, ఇంజనీరింగులలోని ప్రత్యేక సమాచారాలు,

సాంకేతిక నైపుణ్యాలు ప్రజలకి చక్కగా ఉపయోగపడతాయి. సామాజిక శూన్యంలో మనం పనిచేయ్యలేము, బతకలేము. విద్య-సమాజం యొక్క అంతరాత్మను విస్తృత పరచాలి, లోతుల్ని స్పృశించాలి. నైతిక విలువలకు, పరస్పర అవలంబనముతైన మానవ భావాలకు ప్రాముఖ్యతనివ్వాలి. విజ్ఞాన శాస్త్రం నాగరికత యొక్క పనిముట్లనిచ్చింది. కాని అవి ఎలా ఉపయోగించాలో నిర్దేశించలేదు. సరయిన మార్గదర్శకత్వం-నైతిక విలువల నుండి, సామాజిక ఆదర్శాల నుండి రావాలి. UEC ప్రకారం - 'మనం ఒక నాగరికతను నిర్మిస్తున్నాం. కార్ఖానానో, కర్మాగారాన్నోకాదు. నాగరికత యొక్క నాణ్యత భౌతిక సామగ్రిమీదో, రాజకీయ యంత్రాంగంమీదో ఆధారపడిలేదు. వ్యక్తుల శీలాలమీద ఆధారపడుతుంది. శీలాన్ని వృద్ధిపరచడం విద్యయొక్క పని'. విద్య అజ్ఞానం, అకారణంగా ఏర్పరచుకున్న అభిప్రాయాలు, అనాధారిత నమ్మకాలు వంటి అవరోధాల నుండి స్వేచ్ఛను కల్పించాలి.

విద్య జాతి, మత, లింగ భేదాలు, వృత్తి లేక ఆర్థిక హోదా వంటి విచక్షణ లేని సమాన స్వేచ్ఛ, సమాన హక్కులను పరిరక్షించే ప్రజాస్వామ్యాన్ని బలపరిచేగొప్పసాధనం. అయినా సమాన అవకాశం అంటే అందరికీ ఒకేరకమైన అవకాశం అనికాదు అర్థం. ఆయా వ్యక్తుల శక్తి సామర్థ్యాలు, అభిరుచులు, శ్రద్ధాసక్తులను గుర్తించి, వాటి ద్వారా లాభం పొందే విధంగా ప్రతి వ్యక్తికీ అవకాశం ఇవ్వడం.

విద్య సంస్కృతిని విస్తృతపరిచే విధంగా ఉండాలి. సంస్కృతి సమాజాన్ని ఏకతాటిపై నిలుపుతుంది. వ్యక్తిగత హోదాను, సంబంధ బాంధవ్యాలను పెంపొదిస్తుంది. సంస్కృతి ముఖ్యంగా బౌద్ధికమైన జాగరూకతని, సౌందర్యాన్ని మనిషి, భావాలని, సామాజిక ఉత్సుకతని గ్రహించేలా చేస్తుంది. భారత దేశం వివిధ స్వభావాలు, సంప్రదాయాలు, ఆలోచనా విధానాలు, నమ్మకాలలో వైవిధ్యాన్ని చూపించే సర్వసాధారణ నాగరికతను పరిణమింప జేసింది. భారతీయ సంస్కృతిలో చేరే కొత్త లక్షణాలు పాతని పూర్తిగా తుడిచిపెట్టేయవు; వివిధ కాలాల్లోని మంచి విషయాలను తీసుకుని ఏక సామాజిక విధానాన్ని పెంపొందిస్తుంది. ఆరోగ్యకరమైన జీవన సంస్కృతి నిరంతర సృజనాత్మకమైనది. భౌతికమైనా, సామాజికమైనా, ఆధ్యాత్మికమైనా అది కొత్త ఒరవడులను, సమస్యలను ఆహ్వానిస్తూ ఉండాలి, బదులిస్తూ ఉండాలి. సంస్కృతి సాహసోపేతమైన శక్తిని కోల్పోయినపుడు గత వైభవాన్ని విగ్రహాల్లో పొందుపరచి తృప్తిపడుతుంది. సంస్కృతిని ముందుకు నడిపించే శక్తులను కాపాడ్డం, ప్రజాస్వామ్యం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలనే విలువలను పొందుపరచడం విద్య యొక్క పవిత్ర కర్తవ్యం.

మనిషి స్వభావం రెండు రకాలుగా ఉంటుంది. అతను దేన్నయినా సృష్టించనూగలడు, నాశనమూ చెయ్యగలడు; బుద్ధి కుశలతల ఉన్నత శిఖరాలు చేరగలడు లేదా అగాధాల్లో పడిపోనూగలడు. ఈ విధమైన ద్వైదీ స్వభవాన్ని విద్య ద్వారానే అధిగమించగలడు మనిషి. రకరకాల మనస్తాపాల నుండి విముక్తి పొందనంతవరకు, తప్పులన్నీ సరిదిద్దనంత వరకు, చెడుని అధిగమించనంతవరకు ఈ యుద్ధ రంగం నుండి పారిపోకుండా ఉండడం అతని కర్తవ్యం. అతని అంతరంగంలో కూడ దాదాపు అదే విధమైన యుద్ధం జరుగుతుంటుంది.

రాధాకృష్ణన్ తాత్విక, విద్యా సంబంధమైన చింతనలో మతానికి ఎంతో ముఖ్యమైన స్థానం ఉంది. మతం మనిషిని మనీషిగా చేస్తుంది. అతని అస్తిత్వాన్ని పూర్తిగా సమన్వయ పరుస్తుంది. మతం పూర్తిగా ఒక కొత్త భావాన్ని పరిచయం చేస్తుంది. కొత్త విలువలను పెంపొందిస్తుంది. అయితే మతం సిద్ధాంతానుసరణకాదు; కర్మకాండాల కార్యక్రమమూ కాదు. అది వ్యక్తికీ, ఉన్నతమైన శక్తికీ మధ్య జరిగే వ్యక్తిగత పోరాటం. పిల్లలు- మత సహనం, లౌకిక విలువలతో కూడిన ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగాలని రాధాకృష్ణన్ ఆశించారు. లౌకిక వాదం అంటే మతాన్ని అలక్ష్యం చెయ్యడంకాదు,

ఉపేక్షించడమూ కాదు. అది అన్ని మతాలను ఒకేలా గౌరవించడం, మనిషి పవిత్రం అనుకునే దేన్నయినా గౌరవించడం, గౌరవించదగిన దేన్నయినా గౌరవించడం.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితోనే కాకుండా, ప్రజల మనసులకి, హృదయాలకి ఒక ఆకారం ఏర్పరచడంలో కూడ విద్యాసంస్థలు ఒక విధమైన జాతీయ క్రమశిక్షణను తీసుకురావాలని రాధాకృష్ణన్ ఆశించారు. ఆయన తన ఒకానొక ఉపన్యాసంలో విద్యార్థులకు ఈనాటి పరిస్థితుల కనుగుణంగా, ధైర్యంగా, ఆత్మ నిగ్రహంతో, మానసిక సమతౌల్యంతో సమస్యల నెదుర్కొనేలా శిక్షణ నివ్వాలని అభిప్రాయపడ్డారు. ఒక గొప్ప కారణం కోసం ఉత్సాహభరితమైన క్రమ శిక్షణ లేకపోతే, విద్యార్థులు తమకుతామే కాక సమూహానికి కూడ ప్రమాదకరంగా తయారవుతారు. ఈ విషయంలో ఆయన చక్కని పరిష్కారం చూపించారు. విద్యార్థులు/ యువత ప్రపంచంలోని మహాకావ్యాల్ని (Classics) చదవాలని, వాటిలోని పరిస్థితులని, పాత్రలని అవగాహన చేసుకోవాలని ప్రోత్సహించారు. ప్రతిరోజూ ఉదయాన్నే కాస్సేపు నిశ్శబ్దంగా ధ్యానం చేసుకోవాలని UEC ప్రతిపాదించింది. విశ్వవిద్యాలయాలు ఈ విషయాలను జాగ్రత్తగా పరిశీలించి, పట్టించుకోవాలని ఆయన ఆశించేరు.

విశ్వవిద్యాలయాల గురించి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఉన్నతమైనవి, నిర్దిష్టమైనవి. మనిషి బౌద్ధికత, సంకల్పశక్తి, భావోద్వేగాలు- ఒక క్రమంలో శిక్షణపొందేది ఇక్కడే. ఇందులో అనుభవం, సాహసం రెండూ ఉంటాయి. గతంలో గొప్ప ఆవిష్కరణలు చేసిన మేధస్సును గౌరవించడం, భవిష్యత్తులో విజ్ఞానాన్ని విస్తృతపరచడం విశ్వవిద్యాలయాల వంశపారంపర్యహక్కు. అక్కడ బోధించే పాఠ్యాంశాలలో ఉచ్ఛ అధ్యయనం, గొప్ప పరిశోధనలు జరిగేలా విశ్వవిద్యాలయాలు ప్రోత్సహించాలని రాధాకృష్ణన్ అభిలషించేవారు. యూనివర్శిటీ అంటే ఒక దేశపు మేధా జీవితం సంరక్షింపబడే ఒక సురక్షిత ప్రదేశం. గొప్ప పరిశోధనలు చేసి ఇతరులకు మార్గదర్శకులయే ప్రొఫెసర్లు/ ఆచార్యులు మనక్కావాలి. అటువంటి వారు దైనందిన జీవితంలోని కష్టసుఖాలకు అతీతంగా ఉండాలి. ఆరోగ్యకరమైన జాతి యొక్క మూలాలు ప్రజల్లోనే ఉంటాయి. కాబట్టి విశ్వవిద్యాలయాలు కేవలం డాక్టర్లను, ఇంజనీర్లనేకాక స్వయంగా ఆవహించగలిగే స్త్రీ పురుషులను తయారుచెయ్యాలి. విశ్వవిద్యాలయం అన్న మాటలోనే విశాల దృక్పథం ఇమిడి యుంది. మానవుడికి సంబంధించిన ఏ విషయమూ దానికి పరాయిదికాదు. విశ్వ మానవ సమాజాన్ని పెంపొందింప జెయ్యడమే దానిపని. ఈ పని ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఒకరినొకరు అర్థం చేసుకోడానికి సహాయపడుతుంది.

విశ్వవిద్యాలయాల్లో పనిచేసేవారు కేవలం అధ్యయనమేకాక ఆత్మసంస్కారాన్ని అలవరచుకోవాలి. ఈ సంస్కారం- దురాశ, పొగరుబోతు తనం వంటి గుణాలను జయించడమే కాక ఒక విధమైన జీవన విధానాన్ని పెంచుతుంది. సమాజంలోని ఇతర సభ్యులతో ప్రవర్తించే తీరుని నేర్పుతుంది.

మనిషిని మనిషిగా తయారు చేసే బాధ్యత విశ్వవిద్యాలయంలకే అప్పగించబడింది. అయితే నిజంగా మనం మనుషుల్ని తయారుచేస్తున్నామా, చిలకపలుకులు పలికే జనాన్ని తయారు చేస్తున్నామా? సంస్కార వంతమైన భావాలను పెంపొందిస్తున్నామా? ప్రకృతకి, సమాజానికి సంబంధించిన ఉద్దేశాలను, అవగాహనని వృద్ధిచేస్తున్నామా? ఏ విశ్వవిద్యాలయానికైనా అదో పెద్ద పరీక్ష. ఈ ఉద్దేశాన్ని మనం నెరవేర్చకపోతే ముందు ముందు ఎదుర్కొనే వైఫల్యాలకు మనమే బాధ్యత వహించాలి.

విశ్వమానవ విలువలను గౌరవించేలా మనిషిని తయారు చేయ్యాలి. వివిధ భావాలను, అభిప్రాయాలను ప్రాక్, పశ్చిమ దేశాల విశ్వవిద్యాలయాలు పంచుకోవాలి. విజ్ఞానంలో, పాండిత్యంలో ప్రపంచస్థాయిలో మన దేశం పోటీపడాలంటే విశ్వవిద్యాలయాల్లో నిజమైన మేధావులను నియమించాలి.

వారు అధ్యయనానికి, పరిశోధనలకి అంకితం కావాలంటే, వారు సౌకర్యవంతమైన జీవితం గడిపేలా ఉండాలి. తక్కువ జీతాలు ఇస్తే యువ అధ్యాపకులు అసలైన మేధ విలువలను మెచ్చుకోలేకపోగా, పాఠ్యపుస్తకాలు, గైడ్లు తయారు చెయ్యడంలోను, ఎగ్జామినర్‌షిప్‌లు తీసుకోవడంలోనూ ఆసక్తి చూపిస్తారు. విశ్వవిద్యాలయాల్లోని ఉద్యోగాలు All India Services అంత ఆకర్షణీయంగా ఉండాలి. ఆ విధంగానైనా కొందరు సమర్థవంతులైన వ్యక్తుల్ని నియమించుకోవచ్చని రాధాకృష్ణన్ అభిప్రాయం. విద్యార్థులు సాధారణంగా అధ్యాపకుడిని ఒక ఉదాహరణంగా, నమూనాగా తీసుకుంటారు. కాబట్టి అధ్యాపక వృత్తి ఎంతో నైతిక బాధ్యతతో కూడి ఉన్నదని ఒప్పుకోకతప్పదు.

గురువు అనే మాటకి అజ్ఞానాంధకారాన్ని పోగొట్టేవాడు అని అర్థం. ఆచార్యుడు అనికూడ వాడవచ్చు. ఆచార- అంటే ప్రవర్తన- చూసి నేర్చుకోదగినది- మంచిది అని అర్థం. అంటే అతను తన మంచి ప్రవర్తనతో, ప్రేమతో క్రూరత్వం, కిరాతకాలను దూరం చేస్తూ విద్యార్థులను ప్రేరేపించగలగాలి. యువతలో అటువంటి దృక్పథాన్ని పెంచకపోతే మనని మనం మంచి అధ్యాపకులుగా ఎంచుకోలేం. అధ్యాపకుడు ఉదారబుద్ధిగల, మంచి ప్రవర్తనగల ధైర్య సాహసాలుగల యువతని కొత్త పరిస్థితులు, కొత్త సమాజాన్ని తయారు చేసే విధంగా ప్రేరేపించాలి. ఈ దేశపు నేపథ్యం, దాని విలువలు క్షుణ్ణంగా వివరించగలగాలి. అధ్యాపకుడు ఒక 'మోడల్' లా ఉండాలి. అప్పుడే అతను తగిన గౌరవాన్ని పొందగలుగుతాడు. విశ్వవిద్యాలయ జీవితం అధ్యాపకులు, విద్యార్థులు పరస్పర సహకారంతో అనుభవించే ఆసక్తికరమైన జీవితం. అధ్యాపకులు నిరంతర పరిశోధకులు.

విద్య విషయంలో, విశ్వవిద్యాలయాల విషయంలో రాధాకృష్ణన్ అభిప్రాయాలు ఎంతో ఉన్నతమైనవి, గౌరవింపదగినవి. ఆయన ఆదర్శవాదే కావచ్చు, కాని ఆ అభిప్రాయాలు కేవలం 'ఉటోపియా' కాదు. మనిషి వ్యక్తిత్వం వికసించడానికి, సమాజం అభివృద్ధి చెందడానికి కాకపోతే చదువు ఉద్దేశమేమిటి? చదువు ఉపాధిని కూడ కల్పించాలని ఆయనన్నారు. ఇందులో ఆయనతో విభేదించడానికేమీలేదు.

అయితే పరిస్థితులే మారాయి. పరిస్థితుల నవగాహన చేసుకోవడంలో మనిషి సమర్థతే మారింది. ఇంతగొప్ప విద్య- కేవలం 'డిగ్రీ'ల్లో మాత్రమే ఇరుక్కుపోయింది. డిగ్రీలు కేవలం ఉపాధికే మిగిలిపోయేయి. విశ్వవిద్యాలయాల్లో మేధస్సుకి విలువే లేకుండా పోయింది. మేధస్సుతో, బౌద్ధిక విలువలతో సంబంధంలేని వ్యక్తులు విశ్వవిద్యాలయాల్లో నియమింపబడుతున్నారు. బెర్‌ట్రండ్ రస్సెల్ చెప్పినట్టు - విద్యతో సంబంధం లేని వ్యక్తులు, అన్ని స్థాయిల్లోను, విద్యను శాసిస్తున్నారు. ఈనాడు విద్యార్థులను అన్నివిధాలా ప్రేరేపించే, వారికో మోడల్‌గా, ఉదాహరణగా నిలిచే ఆచార్యులూ లేరు; గురువును గౌరవించాలనే కనీస జ్ఞానంగల విద్యార్థులూ లేరు; చదువును కొనేవారేగాని, చదువుకునేవారులేరు. మనిషిలో భౌతికంగా, మానసికంగ, ఆధ్యాత్మికంగా విలువలను అభివృద్ధిపరచి అతన్నొక పరిపూర్ణ వ్యక్తిగా తయారు చేసే విద్యకాక - కేవలం భౌతికమైన విలువలే అసలైన విలువలు అని భ్రమింపజేసే విద్య- ప్రపంచ వ్యాప్తంగా ఉంది. విద్యాలయాలు వ్యాపార సంస్థలుగా మారి, నకిలీ విలువలతో కూడిన విష సంస్కృతిని పెంపొందిస్తున్నాయి.

ఏ దేశపు అభివృద్ధి అయినా ఆదేశపు నేపథ్యం మీద ఆధారపడి ఉంటుంది. అది సహజం. ఎక్కడెక్కడో అరువు తెచ్చుకున్న సిద్ధాంతాలు అభివృద్ధిని ప్రోత్సహించకపోగా, సామర్థ్యాన్ని పెంచకపోగా, విలువల్ని విస్తరించకపోగా ఆ దేశపు ప్రగతిని ముందుకెళ్లనీకుండా చిన్నాభిన్నం చేస్తుంది. అవేవీ గ్రహించకుండా ఒక నిర్దిష్టగమ్యంలేని ఎడారి దారుల్లో పయనిస్తూ నిర్వీర్యమైపోతుంది ఈనాటి యువత. కాబట్టి ఒక్క మాటలో చెప్పాలంటే, ఇటువంటి పరిస్థితులలో మనం ఇంతవరకు చెప్పుకున్న రాధాకృష్ణన్ అభిప్రయాలను మరొక్కసారి మననం చేసుకోవడం ఎంతాయినా అవసరం...

# ఆధునికత నుంచి అదృశ్యంలోకి
## 'ఢాకన్' కథ అంతర్యం

- బి. చంద్రశేఖర్

ఆధునిక విశ్లేషకుల సైద్ధాంతిక దృక్కోణానికి అందని సమాజ భాగాలున్నాయి.

- దీపేష్ చక్రవర్తి 'హేబిటేషన్స్ ఆఫ్ మాడర్నిటీ'

హిందూ మతోన్మాదం, సంఘపరివారం ఆధునికతకు సంబంధించనవి, బ్రిటీషు వలసవాద విషఫలితాలు. ఆధునిక పూర్వ విషయాలతో వాటి సంబంధం కేవలం పైకి కనిపించేవి మాత్రమే.

ఆధునికత ఇంకా బాగా సోకని ముస్లింల పట్ల శత్రుపూరితవైఖరి ప్రదర్శించడం ద్వారా హిందుత్వ శక్తులు బతుకుతాయి. (ఆ మాట కొస్తే ఆధునికమైన ప్రతిదీ ఆధునికపూర్వ విషయాల కొనసాగింపు, విధ్వసం పైనే బతుకుతుంది). హిందుత్వం ఉనికిలో ఉండాలంటే ముస్లింలు ఆధునికపూర్వస్థితిలో ఉండక తప్పదు. వారు ఆధునికతలోకి ప్రవేశించడాన్ని అందుకే హిందూ మతోన్మాదం సహించలేదు. గుజరాత్‌లో పలుచోట్ల ముస్లిం వ్యాపార వర్గంపై, ఆధునిక ముస్లింపై సంఘపరివారం చేసిన అమానుష దాడులను ఈ నేపథ్యం నుంచి మాత్రమే అర్థం చేసుకోగలం. హిందుత్వం నుంచి పుట్టున్న మౌతున్న హింసను ఆధునికత నుంచి పుట్టువించినదిగా కాక ఆధునిక పూర్వ హింసగా, మధ్యయుగ మౌఢ్యంగా అపార్థం చేసుకునే లౌకికవాద మేధావుల విశ్లేషణకు గుజరాత్ ఎన్నటికీ అర్థమయ్యే అవకాశం లేదు. ఆధునికతలోకి ప్రవేశించడం ద్వారా హిందుత్వం నుంచి రక్షించుకోవచ్చునని వారు ముస్లింలకు తప్పుడు పరిష్కారాలు సూచించి భంగపడుతున్నారు.

ముస్లింలు ఆధునికతలోకి ప్రవేశించడం అంటే వారు తమ అస్తిత్వాన్ని వదులుకోవడం. వారు దేనిని రక్షించుకోవడం కోసం 'పరిష్కారాన్ని' ఆశ్రయిస్తారో, అది 'పరిష్కారం'చే ధ్వంసించబడటం, పాశ్చాత్త్యీకరించ బడటం తప్ప మరొకటి కాదు. కాబటి, గుజరాత్ లాంటి ఘోరకృత్యాలు జరిగిన సందర్భాల్లో లౌకిక వాదులు చేసే కృషికి పాశ్చాత్య దేశాల నుంచి అండదండలు పుష్కలంగా వుంటాయి. విదేశీ నిధుల స్వచ్ఛంద సంస్థలు ముస్లింల మనసులను దోచుకొనేందుకు రంగప్రవేశం చేస్తాయి. న్యాయపోరాటాల పేరిట కూడా వలస న్యాయ సంవిధానం వేపు దృష్టి మరల్చుతాయి. ఆధునికపూర్వ జీవన స్థితి నుంచి ముస్లింల అస్తిత్వాని 'ఉద్ధరించి' పాశ్చాత్య పెట్టుబడి అవసరాలకు తగిన విధంగా వారిని ఆధునికులుగా మార్చే పనిలో నిమగ్నమౌతాయి. వీటితో వామపక్షాలతో సహా ఇతర లౌకికవాద శక్తులు సైతం చేతులు కలుపుతున్నాయి. తద్వారా ముస్లింలు ఛాందసులనే హిందుత్వ ప్రచారానికి మరింతగా తాత్విక సమర్థనను సరఫరా చేస్తున్నాయి. ఆధునికతా ప్రవేశం ముస్లింల సమస్యలకు పరిష్కారమిస్తుందని భ్రమలో తాముండి అదే భ్రమకు వారిని కూడా గురిచేస్తున్నాయి. ఈ దేశ ముస్లిం అస్తిత్వ భూమికను చదును చేసి పాశ్చాత్య పెట్టుబడి విషబీజాలను నాటే ప్రయత్నంలో సహకరిస్తున్నాయి. హిందుత్వ బూచి చూపి ఆధునికపూర్వ అస్తిత్వాలను ధ్వంసం చేసే పాశ్చాత్య పెట్టుబడి కార్యానికి అచేతనంగా సహకారం అందజేస్తున్నాయి.

ఒక వేపు ముస్లింలు ఇంకా ఆధునికతవేపు రాలేదని ప్రచారం చేస్తూ, వారిని మూఢులుగా, ప్రతినాయకులుగా చూపుతూ, మరోవేపు ఆధునికతలోకి ప్రవేశించాలనుకున్న ముస్లింల ప్రయత్నాన్ని

---

బి. చంద్రశేఖర్, ప్రసిద్ధ న్యాయవాది, మానవ హక్కుల యోద్ధ, గుంటూరు.

నమ్మకం చేయడానికి సంఘ పరివారం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. ఇక్కడే సామ్రాజ్యవాదానికీ, హిందూ మతోన్మాదానికీ చుక్కెదురు అనిచెప్పవచ్చు. సామ్రాజ్యవాదం ముస్లింల అస్తిత్వాన్ని ఆధునికతలోకి ఆకర్షించి హరించి, వారిని తన అవసరాలకోసం వాడు కొనేందుకు ప్రయత్నిస్తుంది. (తన అవసరాలకు తగినంతగా మాత్రమే అది ఎవరికైనా ఆధునికతను అంటిస్తుందని వేరేచెప్పనక్కర్లేదు). కానీ, హిందూ మతోన్మాదం దానికి అభిముఖంగా ప్రయాణిస్తుంది. ముస్లింలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లను అందుకే హిందుత్వం వ్యతిరేకిస్తుంది. ఇక్కడే విదేశీనిధుల ఎన్జీవోలు అభ్యుదయ పోజుపెట్టి హిందుత్వం నుంచి ప్రజలను రక్షించి సామ్రాజ్యవాద ప్రభావంలోకి తెచ్చేపని చేయగలుగుతాయి.

ఆధునికతలోకి తమ ప్రవేశాన్ని నిరోధించే హిందూ ప్రయత్నాలవల్ల, ఆధునికతలోకి ఆకర్షించి తమ అస్తిత్వాన్ని హరించే సామ్రాజ్యవాద ప్రయత్నాలవల్ల 'ముస్లిం మతోన్మాదం'గా చెప్పబడే రాజకీయ కార్యాచరణ వేపు కొందరు ముస్లింలు మరలి పోవడం సంభవిస్తుంది. వారు ఆధునికత నుంచి అదృశ్యమై పోతారు. వారు అనామకులౌతారు. వారి ముఖాలూ ముసుగులు ధరిస్తాయి. ఖదీర్ బాబు 'ధాకన్' కథ ఈ పరిణామాన్ని అద్భుతంగా చిత్రించింది.

ఆధునికతలోకి కొంతమేరకు ప్రవేశించిన ముస్లిం కుటుంబం చుట్టూ కథ నడుస్తుంది. రసూల్ అహ్మద్ పదవీ విరమణ చేసిన తంతితపాల శాఖ చిరుద్యోగి. భార్య ముబషీరా బేగం. ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు. బురఖాల్లో సంప్రదాయబద్ధంగా కూతుళ్ళను పెంచారు. ముప్పై ఏళ్ళయినా పెళ్ళి చేయక పోయేసరికి పెద్దకూతురు ఒక ఆటోడ్రైవర్‌తో వెళ్ళిపోతుంది. (ఇతని కుల మత ప్రస్తావన లేదు కాబట్టి ముస్లిం అనే అనుకోవచ్చు). మిగిలిన ఇద్దరు కూతుళ్ళ పెళ్ళి గురించిన బెంగ భార్యాభర్తలను వెంటాడుతుంది.

ఆధునికత ఒక నిచ్చెనమెట్ల దొంతర. దానిలోపలు ఆధిపత్యక్రమాలు (Heisarchical Orders) వున్నాయి. పల్లెటూళ్ళలో ఆధునికతపై పట్టణాల ఆధునికత, దానిపై నగర ఆధునికత, ఆపై మహానగరాల ఆధునికత, దానిపైపాశ్చాత్య నగరాల్లో ఆధునికత - ఇలా దొంతరలుగా ఆధిపత్య క్రమాలుంటాయి. (ఈ విషయాన్ని కప్పిపుచ్చు పురాణ కథే 'సమానత్వ భావన'. ఇది కేవల మార్మికతే కాదు. నిచ్చెనమెట్ల దొంతరను ఎక్కేందుకు కొందరికి అవకాశముండగా, ఎక్కగలమన్న ఆశను అందరిలో రేకెత్తించే మంత్రజాలం కూడా. భారత రాజ్యాంగ వృక్షానికి 14వ అధికరణంగా అది వేలాడుతుంది). పల్లెనుంచి న్యూయార్క్ దాకా ఆధునికత ప్రస్థానం కొనసాగుతుంటుంది. ధాకన్ కథకు తిరిగి వస్తే, రసూల్ / ముబషీరా బేగం కుటుంబం మిర్యాల గూడా నుంచి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడుతుంది.

ఆధునికతవైపు ఈ ప్రయాణానికి ప్రధాన కారణం ఆ కుటుంబం అదృశ్యమై జీవించాలని కోరుకోవడం. ఎవరూ మనల్ని చూడకుండా బతికే సౌకర్యం నగరాల్లో ఎక్కువగా వుంటుంది. వ్యాపార మాయ తెచ్చిపెట్టిన ఆర్థిక సంబంధాలు మానవ సంబంధాలను స్థానభ్రంశం చేయగా మరింతగా ఏకాకి మానవులు (Individuated Persons)గా, తమ గురించి ఎవరికీ పట్టని బ్రతుకు బ్రతకడం సాధ్యమౌతుంది. ఆధునికపూర్వ జీవితంలో ఈ ''సౌకర్యం'' లేదు. అక్కడ జీవితం సామూహికం. అందులో వ్యక్తిగతం, ప్రజాగతం అనేవి లేవు. వాటికి పెద్దగా అర్థం కూడా లేదు. (అలాంటి సమూహ మానవ జీవితం నుంచి ఏకాకితనానికి మారిన ఆధునిక మానవుల ఆర్తనాదమే హక్కుల ప్రవచనం అని మనోవిశ్లేషణ శాస్త్రదృక్కోణం నుంచి హక్కుల సిద్ధాంతాలను విశ్లేషించిన కొందరి అభిప్రాయం.)

ఢాకన్ కథలో రసూల్, ముబషీరాలు తమ పెద్దకూతురు చేసిన పనివల్ల తలెత్తుకోలేక పోతారు. తామున్న చిన్న పట్టణం నుంచి అదృశ్యమై, ఎవరూ తమని పట్టించుకోని అదృశ్య జీవితాన్నిచ్చే హైదరాబాద్ మహానగరానికి తరలడం అవసరమని వారికి అనిపిస్తుంది.

''పెద్దవూరు మనల్ని ఎవరు పట్టించుకుంటారు... అక్కడ ఎవరి లోకం వారిది'' అంటుంది ముబషీరా. హైదరాబాద్‌లో రసూల్, ముబషీరా కుటుంబానిది కొత్త జీవితం. పెద్దగా ఎవర్ని ఎవరూ పట్టించుకోని జీవితం. తింటున్నారా లేదా, మంచి బట్టలు తొడుక్కుంటున్నారా లేదా. ఆడపిల్లలకు వయసొస్తే పెళ్ళిళ్ళు చేస్తున్నారా లేదా అని ఎవరూ గుచ్చి గుచ్చి చూడరు. కొత్తవాళ్ళు కాబట్టి కనీసం వాళ్ళవర్గకైతే అడగరు. ఎవరిలోకం వారిది. ఎవరి బాధలు వారివే.

''ఇంక మనకు ఏ వూరు అయితే ఏమిటి?'' అని ఆమె అనుకోవడానికి మానవ సమూహ జీవితం విచ్ఛిన్నమవడం కారణం. 'సొంతవూరూ', 'తెలిసిన మనుషులు', సమూహ సంబంధాలు (Communitasian Relationships) వీటికి స్థానం లేని స్థితిని ప్రేమించే స్థితికి ఆధునికత కొందరిని చేర్చింది, రసూల్, ముబషీరా కుటుంబం అందులో ఒకటి.

పందొమ్మిది వందల తొంభైల నుంచి అత్యంత వేగంగా ముందుకొచ్చిన ప్రపంచీకరణ ఆర్థిక క్రమం అంతకుముందు ఆధునికతలో చోటు సంపాదించి చిరుజీవాలతో జీవితాలను గడిపిన రసూల్ లాంటి ఉద్యోగులకు తమ సంతానాన్ని ఆ మేరకు కూడా ఆర్థిక ఆధునికతలోకి ప్రవేశపెట్టే అవకాశాలను మృగ్యం చేసింది. శాశ్వత ఉద్యోగులకు చరమగీతం పాడింది. విద్యను, ప్రైవేటీకరించి ఖరీదైనదిగా చేసింది. దాచుకున్న డబ్బుకు వడ్డీరేటు తగ్గించింది. భద్రత లేకుండా చేసింది. పెళ్ళిళ్ళను మార్కెటీకరించి కట్నంతో మరింతగా పెన వేసింది.

అందుకే రసూల్ రిటైరయ్యే నాటికి ఆడపిల్లలు ఎదిగొచ్చి పెళ్ళిళ్ళకూ, కొడుకు ఎంసెట్ రాసి ఇంజనీరింగ్ చేరేసరికి అంతవరకూ ఆయన చేసిన ఉద్యోగమూ చేతికందబోయే పెన్షనూ అంత గిట్టుబాటైనవి కావని, అర్థమయింది. హైదరాబాద్‌లో ఏదైనా చేస్తే కొంత గిట్టుబాటుగా వుంటుందని కూడా రసూల్ ఆలోచించాడు.

ఇవన్నీ కాస్త అటు ఇటుగా మధ్యతరగతి అందరికీ వర్తించే విషయాలు. కాక పోతే ఈ కథలో ప్రత్యేకత ముస్లిం జీవితం. దానికి మరో పార్శ్వం వుంది. ప్రపంచీకరణ క్రమంతో పోటీ దానికి వెన్నుదన్నుగా ఈ దేశంలో నిలిచిన హిందూ మతోన్మాద శక్తులు అదే కాలంలోనే దేశంలో ప్రబలమై ముస్లింల ఆధునికతా ప్రవేశానికి మరింత అడ్డుగోడలను సృష్టించాయి. అభద్రతా భావాన్ని మరింతగా రేకెత్తించాయి.

హైదరాబాద్ పాత బస్తీలో 'ఆధునిక' రసూల్‌కు ఆదాయ వనరులు లేవు. ఆధునికతే అతని శాపం. ఉర్దూ రాకపోవడం వల్ల అతను నెగ్గుకు రాలేకపోయాడు. (మన దేశంలో ఆధునికత, ఆధునిక పూర్వత్వం రెండూ కలసి వుంటాయి. రసూల్‌లోనూ, హైదరాబాద్‌లోనూ. (దీన్నే కొందరు ప్రత్యామ్నాయ ఆధునికతలు (Alternative modernities) అనీ, మరికొందరు బహుళ ఆధునికతలు (Plural Modernities) అనీ అంటుండగా, ఇంకొందరు నిర్నిబద్ధ ఆధునికత (Modernity at large) అని అభివర్ణిస్తున్నారు. ఇవ్వన్నీ ఆధునికతా పరంగా స్థితిని నిర్వచిస్తాయి (ఆధునిక పూర్వత్వం కూడా ఇలాంటిదే, కాబట్టి సంతృప్తి నివ్వవు).

కానీ, ముబషీరా, ఆడపిల్లలు చేసే చెమ్కీ పనిలో కొంత ఆదరువు దొరుకుతుంది. అయితే హిందుత్వ శక్తుల హింసా పర్వం అటు ఆర్థికంగా వారి సంపాదనను దెబ్బతీయడమే కాక, గతంలో లేని అభద్రతా భావాన్ని ఆ కుటుంబంలోకి ప్రవేశపెట్టింది. రసూల్ చిక్కి శల్యమై ఏరోజేం జరుగుతుందోనని భయపడుతుంటాడు. ఇప్పుడు ఆ ఇంటి తలుపుల మూత ఇంటిగుట్టు బయటకు వెళ్ళకుండా వుండటం కోసం మాత్రమే కాదు - బయటి హిందుత్వ ఇంట్లోకి హింసాత్మకంగా జొరబడకుండా కాపాడుకోవడం కోసం కూడా.

ఈ నేపథ్యంలో కథలోకి మొదటిసారి నేరుగా ప్రవేశిస్తాడు సమద్ ( రసూల్, ముబషీరా కొడుకు). గుజరాత్ ఘటనల అనంతరం చెలరేగిన మత కల్లోలాల వల్ల మైనారిటీ కాలేజీ మూతపడగా కర్నాటక నుంచి వెనక్కి వస్తాడు. అతని మానసిక స్థితిలో గుణాత్మక మార్పు.

''ద్వేషం నిండి పోతోంది అబ్బా. వద్దనుకున్నా ద్వేషం నిండి పోతోంది. బయట ఏం జరుగుతున్నదో నాకు అనవసరం. నేను చూడదల్చుకోలేదు, వినదల్చుకోలేదు, వింటే మనిషిగా ఉండలేను. పుస్తకం తెరిస్తే నెత్తురు కనపడుతోంది. ఒక్క అక్షరం కూడా ఇక నేను చదవలేను''.

ఆధునికతలోకి ప్రస్థానం చేయాల్సిన కొడుకు అర్థంతరంగా తిరిగి రావడం రసూల్‌ను కలచివేస్తుంది. ఆ రాత్రే, అతను తుదిశ్వాస విడుస్తాడు. తనకున్న విద్యార్హతలతోనే సమద్ ఆధునికతలోని ప్రస్థానానికి తిరిగి సమాయత్తమౌతాడు.

చదువు తక్కువైనా, 'వాడికి ఇంగ్లీషులో మంచి ప్రవేశం ఉంది. మనిషి కూడా చూడడానికి ఎర్రగా, పొడుగ్గా, అందంగా ఉంటాడు.' ఆధునిక రూపం అతనిది. ఆధునికత తెల్లది, మగది, అందమైనది, పొడగరి, ఇంగ్లీషు మాట్లాడుతుంది. ఇవన్నీ సయద్‌కు దాదాపుగా ఉన్నాయి. 'ఈ మాత్రం ఉంటే చాలు అమ్మీ. మార్కెటింగ్‌లో షైన్ అయిపోవచ్చు' అనేవాడు వాళ్ళ అమ్మతో. ఆధునిక సరుకులను వినియోగదారుల చేర్చే మార్కెటింగ్‌కు ఎదుటి మనిషిని ఆకట్టుకోవడం అవసరం.

కానీ, అన్ని పరీక్షల్లో నెగ్గినా ముస్లిం అవడంవల్ల అతనికి ఏ ఉద్యోగం రాలేదు. హిందూ మార్కెట్‌లో ముస్లిం వ్యతిరేక గాలి ప్రభావం. ( అగ్రకుల మార్కెట్‌లో దళితులు, బిసిల పరిస్థితి కూడా దీనికి భిన్నంగా వుండదు. )

ఇక 'ఉద్యోగమూ లేదు, ప్రయత్నమూ లేదు.' తన ఆంగ్ల భాషా ప్రావీణ్యాన్ని, చర్మ సౌందర్యాన్ని, అవయవాల పొందికను సరుకుల అమ్మకానికి అంకితం చేయాలనుకున్న ఆధునిక సమద్‌కు హిందూ మతోన్మాద మార్కెట్ తలుపులు మూసింది. అతన్ని బలవంతంగా దారి మళ్ళించింది. మరో మనిషిని చేసింది.

''పేరు కొట్టేస్తున్నారు అమ్మీ. ముసల్మాన్ అనే పేరు కనిపిస్తేనే కొట్టేస్తున్నారు. ఇంక పేరు కింద పాత బస్తీ అడ్రస్ కనిపిస్తే లోపలికి కూడా రానివ్వడం లేదు.''

సమద్ స్నేహితులు పేరు మార్చుకొని బ్రతుకు వెళ్ళ మారుస్తున్నారు. తమ గుర్తింపు కోల్పోయి వేరే గుర్తింపులో వృత్తిలో చేరారు. ఆ గుర్తింపు హిందూ గుర్తింపు. సమద్ కూడా ఇప్పుడిక గుర్తింపు కోల్పోయాడు. ముస్లిం గుర్తింపు కాదు. ఆధునిక గుర్తింపు, మార్కెట్ కోసం కాదు. ఆధునికత మీద ద్వేషంతో ఇంటి నుంచి హఠాత్తుగా అదృశ్యమయ్యాడు. సమద్ కుటుంబం ఆధునికతలో అదృశ్యాన్ని కోరుకుంటే, సమద్ ఆధునికత నుంచి అదృశ్యమయ్యాడు.

ఈ కథ ఒక అశాస్త్రీయ, నిరాశాజనక పరిష్కారాన్ని చూపించిందని లౌకికవాదులకు అనిపిస్తుంది. మార్క్సిస్టులు దానికి మినహాయింపు కాదు. ఇరు పక్షాలకూ సమాన సూచిక ఆధునిక హేతువులో నమ్మకం. సమద్ ఇంట్లో నుంచి హఠాత్తుగా అదృశ్యమవ్వడం, మత 'ఛాదసత్వం' వైపు వెళ్ళడం వారికి నిరాశాజనకంగా తోస్తుంది. కాకపోతే హిందూ మతోన్మాదమే ముస్లిం 'మతోన్మాదాని'కి కారణమనీ, ముస్లింలో అభద్రతా భావాన్ని హిందుత్వం నాటుతుందనీ చెప్పేందుకు ఈ కథ వుపయోగపడుతుంది కాబట్టి వాళ్ళు వూరట పొందుతారు.

సమద్ వివక్షకు లోనుకాకుండా ఆధునికతలో కొనసాగితే ఏమై వుండేవాడు? అతను ఇంజనీరో, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివో అయితే ఏమవుతుంది?

అతను ఆధునికతలోకి మరింతగా ప్రవేశించి తన అస్థిత్వ మూలాల నుంచి మరింతగా పరాయి వాడయ్యేవాడు. ఏ అరబ్బు దేశానికో లేదా అమెరికాకో వెళ్ళి (ఇది సెప్టెంబర్ 11 తర్వాత కష్టతరం) డాలర్లు వేటాడే వాడు. ఆధునిక సరకులెన్నిటికో వినియోగదారుడు అయి వుండేవాడు. హిందూమతోన్మాద వ్యతిరేక, (ముస్లిం మతోన్మాద వ్యతిరేక) లౌకికవాద పరిష్కారం ఇంతకంటే ముందుకు సాగదు.

సమద్ కమ్యూనిస్టు అవుతే ఏ మవుతాడు. తన అస్థిత్వాన్ని మరో విధంగా కోల్పోతాడు. మతాన్ని వదిలేస్తాడు.

పాశ్చాత్య నాగరికతా అభివృద్ధి ఫలాలకు అందరూ అర్హులేనని సమానత్వ సిద్ధాంతాన్ని చాటుతాడు. పాశ్చాత్యా హేతువును, శాస్త్రాన్ని వాటి అధిపత్యాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్తాడు. ఫలితంగా ఆధునిక లోతుల్లోకి మరింతగా కూరుకుపోయి గ్లోబల్ పౌరుడౌతాడు. సాధారణీకరించడం ద్వారా సమస్త అస్తిత్వాలను అంతం చేయడం ఆధునికత అంతిమ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో సమద్ తను సైతం సమిధ అవుతాడు.

'అశాస్త్రీయ', 'హేతు వ్యతిరేక' పరిష్కారాన్ని అచేతనంగానైనా సమద్‌కు చూపించడం ద్వారా అస్థిత్వ రాహిత్య స్థితికి వెళ్ళకుండా సమద్‌ను కాపాడాడు. ఆధునికత నుంచి అదృశ్యం ద్వారా తన అస్థిత్వ మూలాలను ధృఢతరం చేసుకునేటట్లు చేయగలిగాడు.

సమద్ అదృశ్యమై కమ్యూనిస్టో, నక్సలైటో కాలేదు. అథవా లౌకికవాది కాలేదు. ఆధునికతను వదిలేసి మరింత ముస్లిం అయ్యుంటాడని ఊహించుకొనేందుకు కథకుడు అవకాశం ఇచ్చాడు. అతను మరింతగా ఆధునికపూర్వ జీవితంలోకి - కాకపోతే ఆధునిక - అనంతర జీవితంలోకి (ఆధునికానంతర వాదానికీ దీనికీ సంబంధం లేదని అడ్డగీత సూచిస్తుంది) వెళ్ళాడు.

అలాంటి వాళ్ళే ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా పాశ్చాత్య దుష్ప్రభావాన్ని నిలువరించగలుగుతున్నారు. అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నేరుగా ప్రశ్నించగలుగుతున్నారు. టెలివిజన్‌లను ధ్వంసించగలుగుతున్నారు. హేతువును కుక్కలకు విసిరేయమంటున్నారు. వారు పరిపూర్ణపరిష్కారం ఇవ్వలేనప్పటికీ (అది సాధ్యమా?) వారి ప్రవచనంలో అనేక సమస్యలు ఇమిడి వున్నప్పటికీ ఇప్పటికిదే సంభవిస్తుంది. దాన్లో ఆధునికత చొరబాటు లేదన్న హామీ వుండనప్పటికీ ఇప్పటికిదే జరుగుతోంది. ఇప్పటికిది ఆశాకిరణమే.

ఒక నవలగా రాయగలిగిన వస్తువుతో కథ రాయడం ఒక రకంగా అభినందనీయమే. క్లుప్తత అద్భుతంగా వుంది... కథ అప్పుడే అయిపోయిందా అని పాఠకులకు బాధ కలిగించేంతగా.

# హాలాహలమే అయినా తాను కరిగిపోతూ అమృత బిందువులను మిగిల్చిన 'డాడాయిజం'

- కాండ్రేగుల నాగేశ్వరరావు

ప్రపంచమంతా నియమబద్ధంగా నడుస్తుందని, మానవ జీవితానికి ఒక అర్థం, పరమార్థం ఉన్నాయని సామాన్యంగా అనుకొంటూ ఉంటాం. ప్రపంచ యుద్ధాలు రెండు జరగడంతో ప్రపంచ మంతా గందరగోళం ఏర్పడింది. పైకి కనిపించే నాగరకత వట్టి పంచదార పూత అని తేలిపోయింది. నిరాశా నిస్పృహలు పెల్లుబికాయి. జీవితానికి అర్థం, క్రమం లేవనిపించింది. అసలు జీవిత లక్షణం గందరగోళమే నేమోననిపించింది. దీనితో మేధావులు గందరగోళం ఆధారంగా జీవితాన్ని చూడాలన్నారు. ఈ రకం ఆలోచనకు, తత్వానికి పేరు గూడ 'గందరగోళం' అనిపించేట్టే పెట్టాలని 'డాడాయిజం' అని పేరు పెట్టారు. నాగరకతకు వ్యాకరణం లేదన్నారు. ఈ 'డాడాయిజం' అని పేరుపెట్టడం గూడ 'క్రమరహిత' పద్ధతిలోనే పెట్టాలనుకొన్నారు. ఆ పేరు ఎన్నిక చేయడం గూడ గమ్మత్తుగా చేశారు. నిఘంటువును తెరిచి ఏ పుటవస్తే ఆ పుటలో ఒక పెన్సిల్ కొసను ఉంచడం. ఆ పెన్సిల్ కొస ఏ పదం మీద ఆనితే, ఆ పదాన్ని తమ వాదానికి నామంగా చేయాలనుకొన్నారు. అలా చేయగా పెన్సిల్ 'డాడా' అనే పదం మీద ఆనింది. ఆ పదాన్నుంచే డాడాయిజం అని పేరు పెట్టారు. 'డాడా' ఆట (బొమ్మ) గుర్రం. - సంపాదకుడు

1914వ సంవత్సరంలో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభించబడింది. పారిశ్రామిక విప్లవం వచ్చిన తరువాత పెద్ద యెత్తున జరిగిన మొదటి యుద్ధమది. అంతకు ముందెప్పుడూ కనీవినీ యెరుగని విధ్వంసక యుద్ధ సామగ్రి నభూతో అన్నట్లుగా పెద్ద యెత్తున ఉపయోగించబడింది. అంతకు పూర్వం జరిగిన యుద్ధాలలో కొన్ని సంవత్సరాలలో జరిగిన విధ్వంస కాండ ఇప్పుడు కొన్ని రోజులలో, కొన్ని గంటల వ్యవధి లోనే జరుగుతుంది. ఈ యుద్ధంలో, ఎన్నో కుటుంబాలు చిన్నా భిన్నమయినాయి. ఎక్కడ చూసినా అల్లకల్లోలం, అరాజకం. కుటుంబ సభ్యులు ఎవరు, ఎక్కడ వున్నారో, అసలు బ్రతికి వున్నారో లేదో తెలియని పరిస్థితి, ఎన్నో విషాద గాథాలు.

ఇది ప్రకృతి జరిపిన దాష్ట్యంకాదు. ఒక మానవుడు మరొక మానవునిపై సాగించిన ఆధిపత్యపు పోరులో బయల్వెడలిన రాక్షసత్వం. కొంచెం స్వరం పెంచి గట్టిగా మాట్లాడితేనే అసభ్యమని, అనాగరికమనీ ఈసడించే ఐరోపావాసులు యుద్ధ సమయంలో కాట్ల కుక్కల్లాగా పోట్లాడుకున్నారు. పశువులకన్నా హీనంగా మాన మర్యాదలు మరచి ప్రవర్తించారు. అంతవరకు సాధించుకున్న నాగరికతలోని సౌకుమార్యం, లాలిత్యం లాంటి సంస్కార లక్షణాలన్నీ ఆ సమయంలో మంటగలసి పోయాయి.

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్సెస్ అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళ, సాహిత్యాలు అభిమాన విషయాలు.

ప్రతి ముప్పై అడుగలకొక ఫిరంగి, ఆవిధంగా నలభై మైళ్ళు, ఒక్క రోజులోనే 60 వేలమంది మరణం. అది ఆనాటి పరిస్థితి. ఫిరంగుల మోతతో దద్దరిల్లిన దేశాల నేపధ్యంలో యుద్ధంలో సర్వస్వం పోగొట్టుకొన్న చాలామంది యుద్ధానికి దూరంగా, స్వేచ్ఛా స్వాతంత్రాలతో తటస్థంగా విరాజిల్లే స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ నగరానికి, అమెరికాలోని న్యూయార్క్ నగరానికి కాందిశీకులుగా తరలి పోయారు. అత్యంత హేయమైన, బాధాకరగతం నుంచి బయట పడ్డ వీళ్ళు 'లలితకళలు దైవ ప్రసాదాలు, ఇవి మనిషిలోని దైవత్వానికి ప్రతీకలన్న' భావనను సెంకించటమే కాకుండా దానిని కూకటి వేళ్ళతో పెరికి వేయాలనుకున్నారు. యుద్ధ సమయంలో బయల్వెడలిన రాక్షసత్వమే మనిషి నిజమైననైజమనీ మిగిలిన లాలిత్య భావనలన్నీ స్వార్థంతో అవకాశ వాదం చుట్టూ ముసురు కొన్న ఉపరి తలపు పై మెరుగులని భావించారు.

ఈనిరాశ, నిస్పృహల నుంచి జన్మించిన నిరాశావాద విధ్యంసక తిరుగుబాటు ఉద్యమమే 'డాడాయిజమ్'. ఇది అప్పటి చారిత్రిక, యాధృచ్ఛకమైన సంఘటనల నుంచి ఏర్పడిన ఒక ఘటన. క్రమ బద్ధం కాని, నీతినియమంలేని వాస్తవ జీవితమే ఒక యథార్థంగా భావించారు. కొందరు రచయితలు, కాళాకారులు. జ్యూరిక్‌లో కాబరేట్ వాలటైర్ (Cabaret Volatire) అన్నచోట గుమిగూడి 1915వ సంవత్సరములోనే దీనికి నాంది పలికారు. అయితే 1916వ సంవత్సరంలో ఫిబ్రవరి 9వ తేదీన సాయంకాలం సుమారు 6 గంటల సమయంలో హ్యూగో బాల్, రిచర్డ్ హోల్‌సక్ బెక్ అనే ఇద్దరు వ్యక్తులు ఫ్రెంచి భాషా నిఘటువును తిరగ వేస్తున్నప్పుడు డాడా అనే మాటను చూశారు. దీనికి కొయ్య గుఱ్ఱమనీ, ముద్దుగా వుండి చిందులు వేసే గుఱ్ఱపు పిల్లని అర్థాలు వున్న ఈ పదాన్ని అర్థప్రతీకపైకాక శబ్ద ప్రాదాన్యతే ప్రధానంగా తీసుకొని అర్థంకాని శబ్దాలతో, మధ్య మధ్య గంటలు మోయిస్తూ, డాలువాయిద్యంతో కేకల మధ్య 'డాడాయిజమ్' అని నామకరణోత్సవం జరిపారు. 1918వ సంవత్సరంలో రుమానియా నుంచి వచ్చి ట్రిస్టన్ జారా, మార్సల్ జన్‌కో, జీన్ ఆర్ప్‌లు దీనికొక మానిఫెస్టో తయారు చేశారు. స్థూలంగా దీని లక్షణాలు :

1. కళ, కళాకృతులు సీరియస్‌గా తీసుకోవలసిన విషయాలు కావు,

2. మానవ సమాజంలో వ్యక్తి కంటే సమాజం ముఖ్యం. వ్యక్తిగతమైన కళ, సౌందర్య దృష్టి హేళన చేయబడింది.

3. నీతనే ముసుగును మన్పైన కప్పిన కుటుంబం, మతం, రాజ్యం మొదలైన వాటిని ఛేదించే పరిపూర్ణ స్వేచ్ఛ మానవునికుండాలి. హేతువాదం, కారాణాల కోసం వెదకటం అనవసరం. మంచి, చెడు, సృష్టి-నాశనం మొదలైన వాటిలో తేడాలు లేవు. వాటికిక్కడ తావు లేదు.

4. కళకు వున్న వ్యాకరణ నిబద్ధమైన అన్ని హద్దులూ తుడిచి వేయబడ్డాయి. యుద్ధానికి కారణ భూతమైన దేశభక్తిని తుడిచి వేయాలనేది ఒక అంతర్లీన సిద్ధాంతం.

5. హృదయాంత రాలలోనున్న భావాలను నిర్భయంగా, నిస్సిగ్గుగా, యథాతథంగా వ్యాకరణంతో సంబంధం లేకుండా వెల్లడించటం ఒక శైలిగా కొనియాడబడింది.

ప్రారంభంలో డాడాయిజమ్ ఒక సాహిత్య ప్రక్రియగా కొనసాగింది. కొన్ని గేయ కవితలు ధ్వని ప్రధానంగా అర్థం పర్థం లేని వాక్యాలతో రచించబడి ప్రచురించబడ్డాయి. వీటిని ప్రచురించడానికి కొన్ని డాడా మాస పత్రికలు చిత్రవిచిత్రమైన 29, 391, న్యూయార్క్ డాడా, 569, 9 అనే పేర్లతో వెలువడ్డాయి. మార్క్స్ ఎర్నెష్టు (Marx Earnest) అనే అవ్యక్త చిత్రకారుని వద్ద శిష్యునిగా వున్న ఫ్రాన్సిస్ పికాబియా (Francis Picabia) అనే చిత్రకారుడు మొట్టమొదటి సారిగా డాడాయిజమ్‌ను చిత్రకళకు విస్తరింప జేసాడు. అతనిని అనుసరిస్తూ మార్సెల్ డిక్యాంప్ (Marcel Dechamp) ఈ ఉద్యమ స్ఫూర్తితో మరి కొన్ని చిత్రాలు గీశాడు. అనేకమంది వర్ధమాన చిత్రకారులు ఈ దారినే నడిచారు. దీనితో జ్యూరిక్ నగరంలో ఒక డాడా గ్యాలరీ ఏర్పరచబడింది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత దార్శనికులైన కొందరు కళాకారులు ఈ డాడా ప్రక్రియను పారిస్ నగరానికి తీసుకొని వెళ్ళారు. భవిష్యత్తును ఆశాజనకంగా భావించే వాళ్ళు వీళ్ళకు బద్ధ శత్రువులు. క్యూబిజాన్ని ఒక అర్థ రహితమైన పురోగామి చర్యగా భావించారు.

క్రమేపీ డాడాయిజమ్ సంగీతానికి కూడా విస్తరింపజేశారు. ఆర్థర్ కానన్ అనే గేయ రచయిత పాటలను, బాక్సింగ్‌లను కలిపి, పాడుతూ - బాక్సింగ్ చేయటమనే ఒక వినూత్న ప్రక్రియను ప్రారంభించాడు. వీరి సమావేశాల్లో అనేక మంది తాము వ్రాసిన గేయాలను, ఎవరికి వారే, ప్రక్కవాళ్ళు ఏమి చెబుతున్నారో ఏమిటో తెలియకుండా, అందరూ ఒకేసారి ఎవరి కవిత్వాన్ని వారే బిగ్గరగా చదివి ఒక కవిత్వ ఘోషను సృష్టించేవారు. పియానో లాంటి వాద్య పరికరాలపై కెక్కి, తొక్కి, పగులగొట్టి, ధ్వంసం చేసి దాని నుండి వెలువడే శబ్దాలను ఆస్వాదిస్తూ అదే సంగీతమనేవారు. 1917వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని ఒక డాడా సమావేశానికి హాజరై అధ్యక్షత వహించవలసిన ఆర్థర్ క్రానన్ తప్పతాగి వేదికపై కొచ్చి మాట్లాడ లేక చివరకు వేదికపైనే బట్టలూడ తీసుకొని దిగంబరంగా నిలబడ్డాడు. (ఇతను ప్రపంచపు మొట్టమొదటి స్ట్రీకర్‌గా భావిస్తారు). చాలాసార్లు సమావేశాలు సభ్యుల మధ్య ముష్టిఘాతాలతో ముగిసేవి. వీటన్నిటినీ సభ్య సమాజంపై నిరసనగా, ఒక జీవన విధానంగా భావించారు డాడాయిష్టులు. ట్రిష్టన్ జారా సాల్వడార్ డాలీతో ఒకసారి ప్లేగువ్యాధి లానే సంగీతానికి కూడా మనం దూరంగా ఉండాలని అన్నాడు. డాడాయిష్టులలో ప్రముఖుడైన హ్యూగో బాల్ ఒక సమావేశానికి కార్డుబోర్డును చాపలా చుట్టుకొని వచ్చాడు. మార్సెల్ డిచాంప్, ట్రిష్టన్ జారాలు నగ్నంగా స్టేజిపై కనిపిస్తూ చిన్న చిన్న నాటకాలు వేశారు. పికాబియా Intermission అనే నాటకం వేసినపుడు ఈ విధంగా ప్రకటన చేసాడు ''ప్రజలకొక హెచ్చరిక నల్లటి అద్దాలు కల కళ్ళ జోడు తెచ్చుకోండి (చూడవలసిన అవసరం లేకుండా), మీ చెవుల్లో పెట్టుకోడానికి దూది తెచ్చుకోండి (వినవలసిన అవసరం లేకుండా), అప్పుడప్పుడూ ఈలలు వేయండి''. దాని కోసం ఉచితంగా విజిల్స్ కూడా ఇచ్చేవారు.

మిగిలిన ప్రక్రియల కంటే చిత్రకళలో డాడాయిజమ్ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. దీనిలో ఫ్రాన్సిస్ పికాబియా, మార్సల్ డిచాంప్ ప్రత్యేకతను సాధించారు. మోనాలిసా చిత్రాన్ని సాంప్రదాయ బద్ధంగా వేసి తరువాత ఆ చిత్రానికి మీసాలు, గడ్డాలు, కళ్ళజోళ్ళు తగిలించేవారు. మార్సల్ డిచాంప్ మూత్రనాళికగా ఉపయోగించే యూరినల్ పాత్రను తల్లకిందులుగా పెట్టి దానిని తయారు చేసిన Mutt అన్న కంపెనీ యొక్క పేరును తారుతో దానిపై రాశాడు.

దీనిని ప్రదర్శనకు పంపగా సహజంగానే న్యూయార్క్ కళా విమర్శకులు దానిని తిరస్కరించారు. వారి తిరస్కారాన్ని నిరసిస్తూ 'గుడ్డివాడు' అన్న పేరుగల తన పత్రికలో ఇది మామూలు యూరినల్ కావచ్చును కానీ దానిని పరిసరాలు మార్చి మరొక భంగిమలో నిలబెట్టటం వలన దీనికొక కొత్త రూపం, కొత్త భావము ఇవ్వబడింది. నిత్యం మనం చూసే కొన్ని వస్తువులు మనం మరో కోణం నుంచి చూసినపుడు అదొక కళాకృతి అవుతుంది అని పేర్కొన్నాడు. ఒక సాధారణమైన వస్తువుకు పరిసరాలు మార్పుతో ఒక అసాధారణ కళాగా మారుతుందనేది అతని భావం. డిచాంప్ చేసిన ప్రయోగాలలో గొప్పగా చెప్పబడుతున్నది 'దిగ్రేట్‌గ్లాస్' అన్నది. దీనిని సమీకరించడానికతనికి ఎనిమిది సంవత్సరాలు పట్టింది. ఇది ఒక అబ్‌స్ట్రాక్ట్ (Abstract) పెయింట్. ఇందులో అద్దాలు, వైర్లు, వార్నిష్ లాంటివెన్నో అయోమయంగా, అర్థంకాని రీతిలో రెండు అద్దాల మధ్య చిక్కుకొని వున్నాయి. దీనిని బ్రూక్లిన్ ఎగ్జిబిషన్‌కు తీసుకొని వెడుతుండగా గ్లాసు మధ్యలో పగిలిపోయింది. అయినా దానిని అలానే ప్రదర్శించారు. కళ పట్ల రోత కలిగించటమే డాడాయిజమ్‌కు ముఖ్య ఆశయమైనా ఈ డాడా కళాఖండాలు( ముఖ్యంగా డిచాంప్, పికాబియా) ఈనాడు అత్యంత ఎక్కువ ఖరీదుకు అమ్ముడు కావటమొక విశేషం.

అయితే ఈ చిత్ర విచిత్రాలైన చోద్యాలన్నీ ఒక విన్నూత్న కళాశైలిగా కొంతకాలం ప్రజలనాకర్షించాయి. ఎంతో అలజడి రేపుతూ, ఎగిసిపడిన ఈ నవీన తరంగం వచ్చినంత వేగంగానే 1923 నాటికి నిశ్శబ్దంగా తెర మరుగయింది. అప్పటి నుండి, ఇప్పటివరకూ అప్పుడప్పుడూ చాటుమాటుగా కొన్ని చప్పుళ్లు చేస్తూ నేనింకా బ్రతికే ఉన్నానని తన అస్తిత్వాన్ని చాటుకుంటుంది.

డాడాయిజం ఎంత ప్రగతి నిరోధకమైనప్పటికీ ఈ ప్రక్రియ కొన్ని విన్నూత్న నిర్మాణాత్మకమైన శైలులకు జీవం పోసింది. నిజానికి 1910 సంవత్సరం నాటికి చిత్రకళలో ఒక స్తబ్దత ఏర్పడింది. క్లాసిజం, కాల్పనికం, రియలిజమ్, ఇంప్రెషనిజమ్, బరోక్, రోకోకో, గాడీ, క్యూబిజం మున్నగు శైలులన్నీ అప్పటికే బాగా విస్తరించి చరిత్రలో తమ స్థానాన్ని నిలుపుకొన్నాయి. డాడాయిజమ్ అధి వాస్తవికత (Surrealism) అనే అద్భుతమైన శైలికి తెర ఎత్తింది. మానవుని లోని సుషుప్త వ్యవస్థకు పట్టం కడుతూ అచేతన భావాలకు రూపురేఖ లేర్పరచింది. ఆగిపోయిందను కున్న

చిత్రకళా స్రవంతి తిరిగి కొత్త కాంతులను సంతరించుకొని తన ప్రయాణం కొనసాగించేలా చేసిన ఘనత డాడాయిజమ్‌దే. డాడాయిజానికి పూర్వం గోడలపై, చెక్కలపై, కాన్వాస్ గుడ్డలపై కుంచెలతో లేదా తాపీ లాంటి ప్రక్రియలతో చిత్రాలు గీసేవారు. అయితే సంప్రదాయ బద్ధంకాని అనేకానేక వస్తువులను కూడా చిత్రకళలో ఉపయోగించటం. డాడాయిజమ్‌తోనే ప్రారంభమైంది. గోనెపట్టాలు, తుప్పుపట్టిన యంత్ర సామాగ్రి, కోటు బొత్తాములు, చక్రాలు, చైనులు, వార్తా పత్రికల నుండి అడ్డదిడ్డంగా కత్తిరించబడిన కొన్ని అక్షర సముదాయాలు. బొమ్మలు వీటన్నిటినీ ఒకచోట జేర్చి ఒక కొత్తకళ రూపుదిద్దుకొంది. దీనికి (College) కల్లేజి అని పేరు. ఇది ఈనాడు ఒక ప్రత్యేకమైన కళగా భాసించుతుంది.

రకరకాల ప్రైమరీ రంగులతో వాష్‌గా వేయబడిన ఆప్ ఆర్ట్ (Op Art) దీని నుంచే స్ఫూర్తిని పొందింది. చేయి ఎటుతిరిగితే అంటు కుంచెను పోనిచ్చి, లేదా కాన్వాస్ పైరంగులలో ముంచిన సైకిల్‌ను తొక్కించి ఆ టైరు గుర్తుల అడ్డదిడ్డమైన ముద్రలను ఒక ప్రక్రియగా గుర్తించటం. ఒక నగ్నస్త్రీ పై రంగులు పులిమి ఆమెను కాన్వస్ పై దొర్లించి ఆవచ్చే గుర్తులను ప్రదర్శించటం లాంటి 'ఆటోమేటిజమ్' అనబడే మరొక విచిత్ర ప్రక్రియ కూడా డాడాయిజమ్‌కు అనుంగు బిడ్డే. ఒక వ్యక్తి నడకను చలనాన్ని ప్రతిబింబించే యాక్షన్ చిత్రాలు. షాండ్లియార్‌లా గాలికి వ్రేలాడ దీయబడి కాంతి దానిపైబడినపుడు వింత వింత కాంతులీనే కైనటిక్ ఆర్ట్ లాంటి కొత్త ఆలోచనలన్నీ డాడాయిజమ్ పునాదిపై మొలిచిన పుష్పాలే.

మోనాలిసా చిత్రానికి గడ్డాలు పెట్టి అపభ్రంసం చేసే వికృత కళ ఛాయాచిత్రంలో ఫోటో మాంటేజ్ లాంటి ప్రక్రియలకు వీలు కల్పించింది. ఇది నెమ్మదిగా ఈనాటి చలన చిత్ర విభాగంలో గ్రాఫిక్స్ అనబడే ప్రత్యేక విభాగంగా వృద్ధిచెంది కోట్లు గడిస్తుంది. విధ్వంసమే ప్రధానంగా భావించిన 'డాడాయిజమ్' ఎన్నో కొత్త రూపాలకు ప్రాతిపదిక కావటం, జన్మనివ్వడం ఒకగొప్ప వక్రోక్తి.

అధిక భాగం మేధావులు ఈసడించుకున్న ఈ ధోరణిలో అయోమయం, విధ్వంసం, ప్రధానమైనప్పటికీ దీనిని గుర్తించిన వారు, లోనయిన వారు అన్ని దేశాలలోనూ వున్నారు. ఎంతోమంది నిష్ణాతులపై దీని ప్రభావం కొద్దోగొప్పోపడింది. శ్రీశ్రీ వ్రాసినగేయాలలో ఆటవెలది, మధాక్కరలు, సి.నారాయణబాబు, పఠాభి, ఆరుద్రలు వ్రాసిన కొన్నిగేయాలు ఆ కోవలోనివే, ఈనాడు టి.వి.లో వస్తున్న కొన్ని సినిమా పాటలను తిరగవేసి పాడటం లాంటి ప్రక్రియలన్నీ ఆకోవలోనివే. ఏది ఏమైనప్పటికీ మానవ నైజములో నిబిడీకృతంగా వున్న ఉన్మత్తధోరణి కిదొక మచ్చు తునక.

1922వ సంవత్సరములో డాడాయిజమ్ దాదాపుగా కనుమరుగవుతున్నప్పుడు దాని సృష్టికర్తలలో ఒకరయిన హోస్లంకన్ (Huselken) తన మరణాన్ని తానే ముందుగా తెలుసుకొని డాడాయిజమ్ నవ్వుకుందన్నాడు. (Dada forsces its end and laughs) అయితే డాడాయిజమ్ పూర్తిగా

మరణించ లేదు. డ్రాక్యులాలా తిరిగి 1948వ సంవత్సరములో (COBRA) కోబ్రా అనే పేరుతో మళ్ళీ తెరమీదకొచ్చింది. కోబ్రా అంటే అందరూ అనుకున్నట్లుగా త్రాచుపాముని కాదు. మూడు దేశాల నుంచి వచ్చిన కొందరు తమ దేశపు మొదటి అక్షరాలను తీసుకొని ఈ పదాన్ని సృష్టించారు. ఇందులో CO కోపెన్‌హాగెన్‌కి, BR బ్రసెల్స్‌కు, 'A' ఆమ్‌స్టర్‌డమ్‌కు సంకేతకాలుగా తీసుకొని ఈ పదాన్ని సంగ్రహ పరచటం జరిగింది. తమ మేనిఫెస్టోలో తాము అనాగరికులు వేసే కళాకృతులనూ, డాడాయిజమ్‌ను స్ఫూర్తిగా తీసుకున్నట్లుగా ప్రకటించకున్నారు. అయితే ఈ శైలీ ఉద్యమం కూడా 1960 తరువాత క్రమేపీ కనుమరుగయింది. మానవ మస్తిష్కంలో దాగున్న ఆరాచకత్వానికి నిదర్శనంగా ఉన్న ఈ ప్రక్రియలు మరో రూపంలో వచ్చే అవకాశం లేక పోలేదు.

**ఈ నెల మిసిమిపై డాడాచిత్రాల వివరణ :**

1. వార్తా పత్రికలో వచ్చిన బొమ్మలను, అక్షరాలను, అడ్డదిడ్డంగా పేర్చిపెట్టి కొత్త కళా శైలికి శ్రీకారం చుట్టబడిన కొల్లేజి అనే ప్రక్రియకు చెందిన చిత్రమిది. దీనిని తయారుచేసిన వాడు హాస్‌మన్ (Hausmann). ఇది ప్రస్తుతం ఇంగ్లడులోని టౌట్ గ్యాలరీలో ఉంది. దీనిని ఆరోజులలో అసందర్భ హాస్యాస్పద చిత్రంగా భావించారు. (మొదటి అట్టపై చిత్రం)

2. 'కోకోడైలిక్' అనే పేరుతో పికాబియా వేసిన చిత్రమిది. '' ఒక చిత్రం యొక్క గొప్పతనం ఆ చిత్రంలో కంటే ఆ చిత్రం వేసిన చిత్రకారుని పేరుతో ముడిపడి వుంటుంది. ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలను కొనే వాళ్ళంతా కేవలం వాళ్ళసంతకం కోసమే ఎగబడి కొంటారు తప్ప చిత్రంలోని గొప్పతనాన్ని బట్టి కాదు.'' అందుచేత ఒక కాన్వాస్‌పై ఆనాటికి డాడాయిష్టులైన ''ట్రిష్టన్ జారా'' మొదలైన డాడాయిష్టుల సంతకాలను అడ్డదిడ్డంగా తీసుకొని ఎంతమంది సంతకాలుంటే అది అంత గొప్ప చిత్ర మౌతుందని పికాబియా పేర్కొన్నాడు. ఈ అభిప్రాయంతో పికాసో కూడా ఏకీభవించాడు. ''తనవి అనేక చిత్రాలు కేవలం నా సంతకం కోసమే అమ్ముడైనాయి తప్పవాటి ప్రతిభననుసరించి కాదని పికాసో పేర్కొన్నాడు. ఈ చిత్రం 1921లో గీయబడింది. ప్రస్తుతం పారిస్ నగరంలో MNAM లో ప్రదర్శించబడుతుంది. ( రెండవ అట్టపై చిత్రం)

M = Musee; N=National; A=D Art; M=Modern in Paris

3. పియానోను ధ్వంసం చేస్తూ సంగీత ఘోషను ఆస్వాదిస్తువున్న డాడాయిష్టులు. ( మూడవ అట్టపై చిత్రం)

4. చిత్రకారుని పేరు పికాబియా, చిత్రం పేరు Amorous Parade 'మోహావేశపు కవాతు' అని అర్థం. చిత్రానికి దానికి పెట్టేపేరుకి సంబంధం లేకుండా ఉండటమన్నది డాడాయిష్టుల ప్రత్యేకత. ఇది ఒక ప్రైవేటు వ్యక్తి యొక్క సేకరణలో ఉంది. (నాల్గవ అట్టపై చిత్రం)

# ''జ్వాలగా జీవించాలని''

- డా॥ యు. ఏ. నరసింహమూర్తి

''ఆయుస్సు నిడివిని
అంచనా వేసే కాలజ్ఞులెవరు
అది ఏక్షణంలో
దారంలా పుటుక్కున తెగిపోతుందో తెలియదు
అందుకే ఉన్నన్నినాళ్లు ఉజ్వలంగా ఉండాలి
ఉదయ సూర్యబింబాన్ని తురాయిలా తొడుక్కుని''

పుట్టిన ఊరును, పెట్టిన పేరును అంటిపెట్టుకొని ఉండే ఆత్మ సంస్కారం మొదట ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. సరళత, తరళత ఆ కవిత్వానికి బహిర్లక్షణం. తరగ పైని నురగను తరచి చూసిన తరువాత విస్తరించగల అర్థపుష్టి ఆయన కవిత్వంలో అంతర్నిహితంగా ఉండే లక్షణం. సంస్కృతాంధ్రాంగ్ల వాఙ్మయ సంప్రదాయంతో పాటు ఉర్దూ, పారశీక వాఙ్మయాల అంతస్సారాన్ని ఆకళించుకోగలిగిన వారు ఆయన కవిత్వ విశ్వంభరా తత్వాన్ని అర్థం చేసుకోగలరు. మధురాధిపతికి సంబంధించిన దంతా మధురమే. నారాయణరెడ్డి పలికినదంతా కవిత్వమే. యౌవనం రాకముందే ఆ హృదయాన్ని ప్రకాశింపజేసిన కవితా కౌముదీ జ్వలనం నిత్యనూతన కాంతులీనుతూ వేయి పున్నముల వెలుగును నిలుపుకోవాలని శత శరత్కౌముదీ సౌష్ఠవాన్ని సాధించడం అవధిగా పురోగమించాలని అహోరాత్రాలు జ్వలిస్తూనే ఉంది. ఆ నిరంతర జ్వాలా తోరణంలో సరస్వతీ శిబికావహుడుగా సాహసాభియానాలు చేసే అక్షరార్చకునిగా సినారె తన చతుస్సప్తతి తమ జన్మదిన సందర్భంగా వెలువరించిన ఇంకొక కమనీయ కవిత్వ జ్వాల ''జ్వాలగా జీవించాలని'' అనే కవితా సంపుటి. ఇందులో 50 జ్వలన జ్వాలికలున్నాయి. పద్యాలు, గేయాలు, మాకందాలు, ప్రపంచపదులు, గజళ్లు - ఇలా ఎన్నెన్ని కవితా రూపాలను వరించినా ఆయన కవిత్వ దీప్తి ఒకలాగే ప్రసరిస్తుంది. ''ఇదమేవ కవిత్వం యద్వాచః సర్వతో దిక్కాః'' అనే ఆభాణకానికి సినారె వంటి కొద్దిమంది కవులు మాత్రమే లక్ష్యంగా నిలుస్తారు. 'కవనార్థంబుదయించితిన్' అన్న చెళ్లపిళ్ల మాటలను మళ్లీ నారాయణరెడ్డి గుర్తు చేస్తారు. సముద్రంలోని కెరటమైనా విశ్రాంతిని కోరుకుంటుందేమో గాని సినారె కవితా చరణం మాత్రం ఎప్పుడూ గమనాన్ని ఆపదు. విరామ చిహ్నాలు లేని ప్రవాహశీలమది.

కవితా లోకంలో ఉన్నత పదాక్రమణోత్సుకమైన ఆ అలౌకికచైతన్యం సినారెకు అమూల్య వరమైంది. లోకంలో కృషీవలుడు మూడు కాలాలే పండిస్తాడు. ఈ కవితా కృషీవలుడు ఆరు కాలాలూ పండిస్తాడు. ఈ పంటలో పొల్లుగింజ, తాలుగింజ అంటూ కనబడదు. ఎందుచేతనంటే చీడ - పీడ లేని కవితాత్మ ఒక్కటే ఆసేద్యాని బీజ సంపదగా నిలిచింది. ఒక్క చరణంలో కూడా ఆయన మేదకుడుగా కనబడడు. అక్షరాక్షరాన కవితా సౌందర్య సాధకుడుగా సాక్షాత్కరిస్తాడు. కవిత పూర్తయేటప్పటికి రసప్రవాహాలు తమకు తాముగా మన వద్దకు కదలివస్తాయి. కమనీయమైన అనుభూతులను కలిగిస్తాయి.

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు. జి. సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

మనకు సొగసు కోర్కెలు కల్పిస్తాయి. పార్లమెంటు సభ్యత్వం, పద్మభూషణ్, జ్ఞానపీఠ్ పురస్కారం వరించి వచ్చిన విశ్వంభరా వల్లభుడు ఇంకా ఏమి కోరి కవిత్వాన్ని రాయాలి? అనే సందేహాన్ని సినారె కవితతోనే నివారించుకోవాలంటే ''ఆశ లేని దెక్కడ? అందుకు తగ్గ ప్రయాస లేనిదెక్కడ?'' అనే పంక్తిని మననం చేసుకోవాలి. దుష్యంతుడు మరీచి ఆశ్రమంలో తపస్సు చేసే మునులను చూసి ఇలా అనుకుంటాడు :

''ప్రాణానా మనిలేన వృత్తి రుచితా
సత్కల్ప వృక్షే వనే
తోయే కాంచన పద్మరేణు కపిశే
ధర్మాభిషేకః క్రియా
ధ్యానం రత్న శిలాతలేషు విబుధ
స్త్రీ సన్నిధౌ సంయమో
యత్కాంక్షన్తి తపోభి రన్య మునయ
స్తస్మిం స్తపస్యన్త్యమీ''

''ఈ మునులు కల్పవృక్షాల నీడలో కూర్చొని కూడా వాయు భక్షణతో ప్రాణాన్ని నిలుపుకొంటున్నారు. స్వర్ణ కమల కింజల్కాలతో కూడిన జలాన్ని ధర్మాభిషేకానికే వినియోగిస్తున్నారు. రత్న శిలల మీద కూర్చొని ధ్యానం చేస్తున్నారు. అప్సరసల మధ్య ఇంద్రియ నిగ్రహాన్ని పాటిస్తున్నారు. ఇతరులైన మునులందరు ఏ కోరికలతో తపస్సు చేస్తున్నారో ఈ మునులు అవన్నీ సిద్ధించినా తపస్సు చేస్తున్నారు,'' అని పై శ్లోకం చెప్తోంది. ఋషికానివాడు కవి కాలేడని పూర్వులన్నారు. సినారె సాధారణ ఋషిలా కాక ఇక్కడి మరీచాశ్రమ ఋషిలా కనిపిస్తాడు. కవులందరూ ఏమి కోరి కవిత్వ రచనకు పూనుకొంటారో అవన్నీ సినారెకు ఎప్పుడో లభించాయి. ఇతర కవుల కోరికలను తీర్చే స్థితిలో ఉన్నా ఆ కవి లోక కర్పూర వసంతరాయలు అనుక్షణం ఏమి కోరి కవిత్వ రచనను కొనసాగిస్తున్నారో? అని ఆశ్చర్యం కలుగుతుంది. ఆ మునులకు, ఈ కవికి ఒకటే ఆశ, విశ్వశ్రేయాన్ని కోరి ముని తపస్సును నిరవధికంగా కొనసాగిస్తాడు. కవి కావ్య రచనకు నిర్విరామంగా కృషి చేస్తాడు.

''జీవిత మన్నప్పుడు
ఎదురుగాడ్పులు ఎదురీతలు ఎదురుదెబ్బలు
ఎలాగూ ఉంటాయి
తొణకని సంకల్పమున్నప్పుడే
చెదరని గతిశీల మున్నప్పుడే
అంతిమ లక్ష్యం అరచేతిలో నిలుస్తుంది.''

అన్న పంక్తులు కవి పడే ప్రయాసను తెలియ జేస్తాయి.

వ్యక్తిగతమైన అనుభూతిని ప్రపంచానుభూతిగా మార్చడంతో పాటు ప్రాపంచిక సత్యాలను

వ్యక్తిగతానుభూతులుగా మార్చే దార్శనికగుణం సినారె కవిత్వంలో ప్రతిచోటా కనిపిస్తుంది. సామాజిక శ్రేయస్సాధన, మానవతావాద భూమిక ఆయన కవితా చైతన్యానికి చోదక శక్తులు అయిన కారణంగా అటువంటి సన్నివేశాలలో ఆయన కవిత్వం లక్షణను, వ్యంజనను కూడా వదలి అభిదా వ్యాపారాన్నే చేబడుతుంది.

''సమాజ సముద్రం లోలోతుల్లోకి
సూటిగా దూసుకుపోతే
అంతుపట్టని గుప్త సత్యాలు
ఆణిముత్యాలై పైపైకి తేలుతాయి.''

సామాజిక సత్యాలను వ్యక్తి చైతన్యంలోకి మళ్లించే ఈ దార్శనిక భూమిక ఈ సంపుటిలోని కవితలన్నింటిలోను కనిపిస్తుంది.

''తన ఇంటికి చిల్లులు పొడిచారని
ఏడుస్తూ కూచోదు వెదురు
ఊదే ఊపిరికి స్వరాలద్ది
తన ఉనికిని సార్థకం చేసుకుంటుంది!
ఔదార్యమంటే అదేమరి.''

పరస్పర విద్వేషాలు, ప్రతారణలు, స్వలాభపరత్వం వంటి అమానుష లక్షణాలతో కళంకితమౌతోన్న సమకాలీన సమాజానికి బాధ్యతాయుతుడైన కవిగా సినారె ఈ సందేశాన్ని అందించడం కావ్య ప్రయోజనాన్ని సముచిత ప్రస్తానానికి కొనిపోవడమే కాగలదు. స్వలాభపరులను త్యాగ నిరతులుగా, అహింసావాదులుగా, ఉదార చరితులుగా పరిణమింపజేసే మహత్తర శక్తి ఈ పంక్తులలో గూడు కట్టుకొని ఉంది. వ్యక్తి ఉన్నతిని సాధించడానికి స్వచ్ఛందంగా చేసే కృషి ఇతరుల ప్రేరణ కంటే, బోధన కంటే ఎక్కువగా ఉపకరిస్తుందని చెప్తూ సినారె ఇలా అంటారు :

''ఎవరో నేర్పితే వచ్చేది కాదు చలనం
అది సమస్త జీవాణువుల్లో సహజంగా రగులుకునే
జాగృతి రూపక జ్వలనం.''

స్వయం కృషితో, ఉద్యమించే వ్యక్తి ఎటువంటి లక్ష్యాన్ని కలిగి ఉండాలో కూడా సినారె నిర్దేశించారు.

''స్వచ్ఛంగా దూకే సెలయేటి తరగలను
ఊపిరిలోకి చేదుకోవాలి
కొలత కందని ఆకాశం విస్తృతిని
తమ లక్ష్యాల పరిధిలోకి మలచుకోవాలి.''

కవిగా ముఖాముఖిగా ప్రబోధించడానికి తలపడే ఇటువంటి చరణాలు కొన్ని దశాబ్దాలుగా సినారె కవిత్వంలో కనిపిస్తూనే ఉన్నాయి. కానీ అవి పూర్వం సాలంకారంగా, సప్రాణంగా ఇంతకు భిన్నమైన శైలిలో ఉండేవి. అనుభవం పండిన కొద్దీ ఇంకా నిసర్గ సౌందర్య సీమలకు తన కవితా వ్యాహారాన్ని తరలించుకొనిపోయే నిర్మమత్వమొకటి ఈ ప్రకృతి మధురమైన ఆవిష్కారానికి ప్రేరణ నిచ్చిందనాలి.

అత్యాధునిక కవి వస్తు రూపాలకు ఆధునిక ముద్ర వేయడంతో తృప్తి చెందడు. తన మానసిక వికృతి నుండి, మేధో మధనం నుండి ఒకగూఢ నిర్మితిని ఆవిష్కరిస్తాడు. సహృదయుడు తనస్తోమతను బట్టి దానిని స్పృశిస్తాడు. దానిలోకి ప్రవహిస్తాడు. దానిలో జ్వలిస్తాడు, దానిని శ్వాసిస్తాడు. దానిలో లీనమౌతాడు. ఇది అటు కవికి, ఇటు సహృదయులకు ఒక కఠోర సాధన. ఒక్కొక్కప్పుడు అదృశ్య ప్రాకారాల వెనుక వ్యూహరచన చేసే ఆ రహస్యోద్యమంలో చేరడానికి, అగాథ తమో గర్భాలలో ప్రవహించే ఆ లోహ నదిలో ఈదడానికి తగిన సాధన సంపత్తిని కూర్చుకున్నా పంచాగ్ని మధ్యంలో నిలచి కఠోర తపస్సు చేస్తేనే కానీ కవీశ్వరుడు సాక్షాత్కరించడు. ఆధునిక కవిత్వం గూఢ నిర్మితి అనే దశను దాటి ఇప్పుడు వినిర్మాణ దశకు చేరుకుంది. ఈ దిశలో కవిత్వం ఉండాలనుకునే పాఠకులకు గానీ, విమర్శకులకు గానీ, కవులకు గానీ సినారె కవిత్వం ఆధునికంగా కనబడదు. సినారె తన వస్తు రూపాలకు స్ఫుటమైన ఆధునిక ముద్ర వేస్తాడు.

> ''వైపరీత్యానికి వ్యాకరణ మెక్కడుంటుంది?
> భరించే కళ్లకు తెలుసు
> దుర్భర దృశ్యాల దొంతరలు కలిగించే
> వైకల్య తీవ్రత
> చూపులెప్పుడూ
> వెన్నెల ఉయ్యాల లూగుతాయనుకోవద్దు
> శూన్య పత్రం మీద
> చిత్ర వర్ణ శిల్పాలను అద్దుతూ పోతాయని
> ఆశించొద్దు.''

ప్రాచీన కవిత్వంలో ప్రచురంగా కనపడే శబ్దార్థ సమన్వయరీతికి, దండాన్వయ పద్ధతికి భిన్నంగా ఆధునికమైన ఆవిష్కారంతో కూడిన ఇటువంటి కవితలే ఈ సంపుటిలో ఎక్కువగా కనిపిస్తాయి. ఇటువంటి చరణాలను చూసినపుడు సినారె కవిత్వం ''సగం స్వప్నాకృతి - సగం సత్యద్యుతి'' అని తెలుస్తుంది.

పఠాభి నుండి నేటి దాకా వచన పద్యం ఎన్నెన్ని పరిణామ దశలను అందుకుందో, ఎటువంటి వికాసాన్ని పొందిందో ఆయన సూక్ష్మేక్షికతో అధ్యయనం చేస్తూ వచ్చాడు. కానీ గూఢ నిర్మితి ప్రధానమని ఆయన ఎన్నడూ అనుకోలేదు. ప్రతీక వాదం నుండి ఇటీవలి వినిర్మితి వాదం దాకా కవితా లోకంలో క్రమంగా పెరుగుతూ వచ్చిన వినూత్న మార్మిక విద్య పట్ల ఆయన ఎప్పుడూ ఆసక్తిని

చూపలేదు. ఆయన దృష్టిలో కవిత్వమంటే కవికి, సహృదయునికి మధ్య నడిచే కోడి పందెం, మేష యుద్ధం కాదు. కనీసం జుగల్‌బందీ కూడా కాదు. అక్షరాక్షరానా ఆధునికతను పొదువుకున్నా అర్థవ్యక్తి అనే గుణాన్ని కైశికి అనే వృత్తిలో రంగరించి వచన పద్య నిర్మాణం చేయడం ఆయనకు అభిమతమైన మార్గమయింది. ఆయనకు గల సంప్రదాయ గౌరవం, ప్రయోగశీలం ఇందుకు కారణాలుగా కనిపిస్తాయి. సినారె రాస్తున్న కవిత్వాన్ని కాగితం మీద పెడుతున్నప్పుడే వస్త్రగళితం చేసి అందులోని మోటుదనాన్ని మూటగట్టి అవతలకు విసిరేస్తాడు. అందులో శ్రుతి కటువైన మాటా ఉండదు, హృదయ శల్యమైన భావనా ఉండదు.

ఆధునిక కవిత్వంలోని ఇంకొక ప్రముఖ గుణం బహుళార్థకత. ఆధునికులు వృద్ధి పొందించిన ఈ విధమైన బహుళార్థకత సినారె కవిత్వంలో లేదు. ఈ బహుళార్థకతకు సందిగ్ధార్థం మూలం. కవి తన అరుదైన శక్తితో ఒక సంవేదనను అందిస్తాడు. ఉదాత్త కవిత్వ సంస్కారం గల సహృదయుడు దాని నుండి ఒక అర్థాన్ని గ్రహిస్తాడు. అందులోంచి ఎవరి దృక్కోణాన్ననుసరించిన అర్థాన్ని వారు గ్రహించ వచ్చును. ఇది మన శ్లేషా కాదు, ధ్వనీ కాదు. మన పూర్వులు కవిత్వంలో బహుళార్థకత కావాలని అనుకోలేదు. వారు ''పృథులార్థ దూరుడై పేద బోలు'' అన్నారు. బహుళార్థకతకు, పృథులార్థకతకు చాలా భేదం ఉంది. సినారె కవితా లోకంలో కూడా పేదకాడు, సంపన్నుడు.

> ''మట్టి పొరల్లోకి దిగిపోయి గుసగుసలాడుకునే
> వేళ్ల భాష మాత్రం ఒకటే
> అసలైన మమకారం అరుపుల్లో కనిపించదు
> నిర్వికల్ప మౌనంలో తప్ప''

శబ్దాన్ని అతిక్రమించి అర్థం తనంత తానుగా విస్తరించే శక్తి ఈ స్థితిలో కనిపిస్తుంది. ఈ శక్తితోనే ఆయన కవిత్వ మంతటా పృథులార్థకత పరుచుకొని ఉంటుంది. కవి పృథులార్థ సాధకుడెలా అవుతాడో సినారె తనకు తానుగా -

> ''నా మేధావలయంలో
> ఒకే క్షణంలో వేయి విద్యుల్లతల ఉద్గమనం''

అనే చరణాలలో అనుభవ పూర్వకంగా వివరించాడు. కవి మేధావలయాన్ని తరచిన కొద్దీ అర్థం విస్తృత మౌతుంది. అంతేకానీ ఎవరికి కావాలనుకున్న అర్థాలను వారు సినారె కవిత్వానికి అన్వయించలేరు. కవిత్వంలో బహుళార్థకత కంటే పృథులార్థకత శ్రేష్టము. తిక్కన ఉద్దేశించిన అనల్పార్థ రచన ఇదే.

అత్యాధునిక కవి వాస్తవానికి తలాతోక కత్తిరించి, అవయవ సంపుటిని అస్తవ్యస్తం చేసి దానిని మాయ లాంతరులో వేసి గిలకరించి ఛాయాగ్రాహక దర్పణం మీద బోర్లించి అందులోంచి చిత్రవర్ణ కిమ్మీరితమైన ఒక స్వప్న శిశువును తీస్తాడు. ఆ అధునాతన కవిత్వ సంబంధమైన మాదక ప్రపంచంలో తలదూర్చిన వాడు అటు గంధర్వ లోకానికీ పోడు, ఇటు మనుష్య లోకానికీ రాడు. ఆ స్వప్న ధూళిలో

స్నానం చేసినవారు అటు అమృతం కురిసిన రాత్రికే దోసిలిపట్టడు, ఇటు నల్లద్రాక్షపందిరి నీడలోనూ సేద దీరడు. అటువంటి ఆధునికత సినారె కవితా ప్రపంచంలో ఎక్కడ వెతికినా కనబడదు. ఆయన తన ఊహా లోకాలన్నింటినీ వాస్తవ జగత్తులోనికి దింపుతాడు. ఊహల చిక్కులు విప్పి, భావాల కురులు దువ్వి, అనుభూతుల పాయలుగా తీర్చిదిద్ది కవిత్వానికి అందమైన జడ అల్లుతాడు.

''అక్కడెక్కడో ఎత్తైన దూరంలో
జాలి గొలుపుతున్న పేలిపోయిన ఆకాశం
అయ్యో నీలాకాశం ఇలా అయిపోయిందే అని
అనుకుంటున్నానో లేదో
రెండు రంగు రంగుల మబ్బు తునకలు
సరదాగా తలలూపుకుంటూ కదిలొచ్చి చేతులు కలుపుకొని
గాఢంగా కవుగిలించుకుంటాయి
కరచాలనాలూ ఆలింగనాలూ
మనుషులకే కాదు మాకు ఉన్నాయ్ లేవోయ్ అని
అవి అదృశ్య భాషలో చెబుతుంటాయి''.

ఇటువంటి కవితలను చదివి నప్పుడు శూన్యం లోంచి సువిశాల వర్ణ చిత్రాలను సృష్టించే దృశ్యభాష ఒకటి సినారేకు పట్టుపడిందని తెలుస్తుంది.

రూపారూపాలకు, స్పష్టాస్పష్టతలకు, చేతనాచేతనాలకు, దృశ్యాదృశ్యాలకు, భావాభావాలకు మధ్య విలోమ గతిలో లీనాలీనమైన విచిత్ర వినిమయ వ్యాపారాన్ని నిర్వహించే విషమ గతి ఆధునిక కవిత్వానికొక ప్రత్యేక ముద్ర వేసింది. నిశ్చయంగా ఇది ఆధునికతకు ప్రాణధాతువులను స్పందింపజేసే జీవనరేఖ అనక తప్పదు. సినారె ఆధునికతకు అంకితమైన కవియైనా అందులోని విలోమ గతిని, వైషమ్యాన్ని మాత్రం తన కవితా సౌధం గడపలోకి రానీయడు. అంతేకాదు, కవితా సౌధంలో కొన్ని చీకటి గదులున్నాయి. శతాబ్దాల నాటి ఆ అభ్యంతర మందిర భిత్తికలను సుధాలిప్తం చేయాలని ఎంత ప్రయత్నించినా అవి కాంతి నిరోధకాలుగానే ఉంటాయి. అక్కడ కవిత్వ కాంతి ఋజుమార్గంలో ప్రసరించదు. సినారె ఆ గదులకు తరుణంలో తాళాలు పెట్టి, బీగాలను భద్రంగా దాచి పెట్టాడు. సమున్నత సింహ ద్వారాలతో, వివృత కవాటాలతో, విశాల వాతాయనాలతో ధారాళమైన సమకాలీన భావ ప్రసారాన్ని అభ్యుదయ కాంతి పుంజానికి ఆశ్రయమిచ్చే కొత్తగదుల్లో కాపురం పెట్టాడు. అందుకే ఆయన కవిత్వంలో ''పుట తిప్పితే చాలు - ఒక సరికొత్త అనుభవం అక్షరాలను తొడుక్కుని నడిచొస్తుంది.''

ఆధునికానంతర వాద కవిత్వంలో శబ్దానికి ఉత్పాతము, వినిపాతములనే రెండు నూతన శక్తులు సంక్రమించాయి. అది ఒక్కొక్కప్పుడు స్వలింగ సంపర్కానికి, సమూహ రతికి పాల్పడి వింత అర్థ శిశువులకు జన్మనిస్తుంది. సినారె ఆధునికానంతర వాద కవి కాదు. అత్యాధునిక కవీ కాదు. కొందరు

ఆధునిక కవులలో కొందరు శబ్దాలతో కొనసాగించే రహః క్రీడను కూడా సినారె కవిత్వం సమ్మతించదు. మానసికోల్లాసం పరవళ్ల తొక్కిన లలితోద్వేగ రంజిత క్షణాలలోని అనుభూతిని ఆవిష్కరించే సందర్భంలో ఎప్పుడైనా ఒక సుకుమార శబ్ద క్రీడ సినారె కవిత్వంలో చోటు చేసుకొంటుంది. ఈ సంపుటిలోని ''స్వరవశింపజేసే వరేణ్య'' అనే కవితలో ఈ రీతి కనిపిస్తుంది. పిల్లల కంటే మనుమలు ముద్దు, మనుమల కంటే మునిమనుమలు ఖుద్దు. మునిమనుమరాలు వరేణ్య సినారె సృజన సూత్రాన్ని ''స్వరవశింపజేసిన'' సంఘటన కవిత్వంగా ఇలా రూపు దిద్దుకొంది.

''కింది నుంచి ఆ గొంత వినిపిస్తే చాలు
నా మనసు
మీడమెట్ల శిఖరాలను దూకే జలపాత మవుతుంది
ఆ స్వరాన్ని అణువణువులో పొదుగు కునే
కలగీతమవుతుంది.''

భాషల కందని పద లహరులను ప్రవహింపజేసే ఈ కవితలోని అనుభవైక వేద్యమైన మధురానుభూతి చాలా అరుదైనది. ఆ అదృష్టం కొందరినే వరిస్తుంది. నూతన పద సృష్టి చేసే ఆ మునిమనుమరాలి పలుకుల చినుకుల్లో సినారె వంటి కవి హృదయం స్వరవశిస్తే ఆ అనుభూతి అందరికీ దక్కుతుంది.

కవిత్వ స్రోతస్వినికి ఈవలి ఒడ్డు నుండి ఆవలి ఒడ్డుకి అంగలు విసిరిన సినారె ఇలా అంటారు:

''ఆ నది నాలో పదిల పరచిన బాల్య తారళ్యాన్ని
ఆ సరళ హృదయ నిర్మాలిన్యాన్ని
అది నాతో కొనసాగించిన నిత్య సాహచర్యాన్ని
ఆఖరి శ్వాస దాకా కాపాడుకుంటూ
ప్రవహిస్తూ ఉంటాను
అలా నేనుంటానంటే
ఆ నది అదృశ్యరూపంలో నాతో ఉన్నట్టే''

ఆ నది సినారె జీవన జ్వాలగా అతని అంతరాంతరాల్లో అను నిత్యం ప్రవహిస్తూనే ఉంటుంది. కవితా ప్రాంగణంలో కనిపించే బాల్య క్రీడలన్నింటికీ ఆయన ఎన్నడో కడపటి వీడ్కోలు చెప్పాడు. కవిత్వం తాలింఖానా కాదని ఆయనకు స్పష్టంగా తెలుసు, అందుకే పద్యాల సంగిడీ లెత్తడానికి మణిబంధానికి మడుగు చీర బిగించడు. కవిత్వం కోమలమైన మలయ పవన వీచిక అనే సుకుమార చింతన ఆయన కవితా లోకానికి స్వాగత తోరణంగా కనిపిస్తుంది. ప్రౌఢవయః పరిపాకాన్ని అధిగమించి పరిణతమైన అనుభవ సర్వస్వాన్ని ఇవతళించుకొని సమున్నత కవితా శిఖరం మీద కూర్చున్న వేళలో కూడా ఆయన లలిత మర్యాదుడు.

# ‘మహా మహోపాధ్యాయుడు’ - బిరుదు పుట్టుక

– డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

ప్రాచ్య విద్యా పారంగతలును, వేదశాస్త్ర విశారదులైన విద్వాంసులను ‘మహామహోపాధ్యాయ’ బిరుదంతో సత్కరించే సంప్రదాయాన్ని మన దేశంలో, వైస్రాయ్ మరియు గవర్నర్ జనరల్‌గా వుండిన లార్డ్‌డఫెరిన్(1884-1888 క్రీ.శ.) ప్రారంభించాడు. విక్టోరియా మహారాణి బ్రిటిష్ సింహాసనాన్ని అధిరోహించిన స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా 1887లో మొట్టమొదటి సారి ఈ బిరుదు మివ్వబడింది.

వైస్రాయ్ ప్రకటన పాఠం ఇలావుంది : ‘‘ఘనత వహించిన వైస్ రాయ్ మరియు గవర్నర్ జనరల్, హిందూ మహమ్మదీయ రాజభక్తుల విద్యావైదుష్యాలను, సముచితంగా గుర్తించే అవకాశాలు లేనందున, భారత దేశము నేలు మహాఘనత వహించిన విక్టోరియా మహారిణి తమ సింహాసనారోహణ స్వర్ణోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని, అతి విశిష్టసేవ లొనర్చిన హిందూ, మహమ్మదీయులు ప్రాచ్య విద్యలలో గడించిన వైదుష్యమును గుర్తించి వినూత్నమైన బిరుదములు ప్రసాదింప నిర్ణయించారు.’’

ఈ ప్రకటన విదేశాంగ శాఖ నోటిఫికేషన్ నం. 811/16-2, 1887న కలకత్తా గెజెట్ తేది 23.2.1887 పార్ట్ 1A, పేజి 23.

‘మహామహోపాధ్యాయ’ బిరుదు ప్రదానంతో పాటు శాలువ, వార్షిక ఫించన్ వంద రూపాయలు, ధృవపత్రము గవర్నర్ జనరల్ నుండి అందుకొంటారు.

ఈ బిరుదమునందు కొన్న మొట్టమొదటి విద్వాంసులు శ్రీ బాపుదేవశాస్త్రి.

ఈ బిరుదు అందుకొన్నవారు తల స్పర్శి పాండిత్యం, విశిష్ట గ్రంథరచన, సమకాలీన పండిత మండలి ప్రశంసలతో విఖ్యాతిగాంచిన వారై వుందురు.

బిరుదమునకు అర్హుడైన విద్వాంసుడు మీమాంసకుడు, స్మృతి వ్యాఖ్యాతగా, తర్కశాస్త్ర వేత్తగా వుండాలి.

ఇంతవరకు దక్షిణ భారత దేశంలో ముప్పది అయిదుగురు, అందుకు రెట్టింపుగా ఉత్తర భారత మండలి విద్వాంసులు ‘‘మహామహోపాధ్యాయ’ బిరుదమందు కొన్నారు.

(‘‘భవన్స్ జర్నల్’ 31.5.1991 సంచిక ఆధారంగా)

---

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, కార్యదర్శి, సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్టు లైబ్రరీ, కడప.

## LITERARY ANECDOTES


### NATHANIEL LEE (1653?-92)

LEE, for aught we know, might have some noble flights of fancy, even in Bedlam; and it is reported of him that while he was writing one of his scenes by moon-light, a cloud intervening, he cried out in ecstacy, 'Jove, snuff the moon!" but as this is only related upon common report, we desire no more credit may be given to it than its own nature demands.



పియానోను ధ్వంసం చేస్తూ సంగీత ఘోషను ఆస్వాదిస్తున్న డాడాయిష్టులు

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/2003



చిత్రం : 'మోహావేశపు కవాతు'

చిత్రకారుడు : పికాబియా